

వారం రోజుల్లో రైతులకు బోనస్ చెల్లింపు



ఇండ్ల నిర్మాణానికి ముగ్గుపోస్తున్న ఎమ్మెల్యే విజయ రమణారావు

ఓదెల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సన్న ధాన్యం పండించిన రైతులకు రూ.31 కోట్ల మేరకు ఈ వారంలో బోనస్ డబ్బులు చెల్లిస్తున్నట్లు ఎమ్మెల్యే విజయరమణారావు తెలిపారు. బుధవారం గుండ్లపల్లిలో రూ.8 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాలను అందజేసి, భూమి పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతికి తావు లేదని, గ్రామాల్లో పారదర్శకమైన అభివృద్ధి జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వం 3500 ఇందిరమ్మ గృహాలు మంజూరు చేసిందని, గుండ్లపల్లికి 25 మంజూరు కాగా 15 వరకు నిర్మాణాలకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ప్రత్యేక అభివృద్ధి కింద రూ.40 లక్షలతో సీసీ రోడ్లకు నిధులు కేటాయించామని, గ్రామంలో పూర్తిస్థాయిలో సీసీ రోడ్లతోపాటు మురికి కాలువల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాజీపడకుండా అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో నిరుపేదలకు కనీసం ఇండ్లు కూడా ఇవ్వలేదని, ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టు కింద శానగొండలో 40 ఇండ్లు పునాది వరకు పూర్తి కావడంతో వారందరికీ రూ.లక్ష చొప్పున చెల్లించామన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి, పుప్పాల శంకర్, చీకట్ల మొండయ్య, ఆకుల మహేందర్, పడాల రాజు, రెడ్డి రజినీకాంత్, సాగర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

డివిజన్ల పునర్విభజనపై ముసాయిదా విడుదల



ముసాయిదా ప్రతులను నోటీస్ బోర్డు ప్రదర్శిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

కోల్‌సిటీ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో 50 డివిజన్లను 60డివిజన్లకు పెంచుతూ పునర్విభన చేయడంపై బుధవారం ముసాయిదా నోటిఫికేషన్ విడుదల చేశారు. ముసాయిదాను నగరపాలక సంస్థ కార్యాలయం నోటీస్ బోర్డులో ప్రదర్శనకు ఉంచినట్టు కార్పొరేషన్ కమిషనర్ అరుణశ్రీ పేర్కొన్నారు. ముసాయిదాపై ఆక్షేపణలు, సలహాలు, సూచనలు ఏమైనా ఉంటే 11 తేదీ వరకు నగరపాలక సంస్థ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

విత్తన స్వయం సమృద్ధే లక్ష్యంగా..



- నాణ్యమైన విత్తనం.. రైతన్నకు నేస్తం ద్వారా విత్తనాల పంపిణీ
- ప్రతీ రెవెన్యూ గ్రామంలో ముగ్గురు రైతులకు నాణ్యమైన విత్తనాలు
- 636 మంది ఆదర్శ రైతులకు వరి, పెసర విత్తనాల పంపిణీ

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ప్రతీ గ్రామంలో రానున్న రెండు, మూడేళ్లలో విత్తన స్వయం సమృద్ధి సాధించడంతోపాటు విత్తన భద్రతలో రాష్ట్రాన్ని దేశంలోని మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. 'నాణ్యమైన విత్తనం- రైతన్నకు నేస్తం' విత్తుకొద్ది పంట అనే కార్యక్రమానికి రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా శ్రీకారం చుట్టింది. పంటల సాగులో నాణ్యమైన విత్తనం పాత్రను గుర్తించిన జయశంకర్ వ్యవసాయ వర్శిటీ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ పథకాన్ని సోమవారం కలెక్టరేట్ ఆవరణలో జరిగిన రాష్ట్ర అవ తరణ వేడుకల సందర్భంగా తొమ్మిది మంది ఆదర్శ రైతులకు వరి, పెసర విత్తనాల సంచులను రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్‌లతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం రెండు రోజులుగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 8 బృందాలు మండలంలోని రైతువేదికల ద్వారా వరి, పెసర విత్తనాలను పంపిణీ చేశారు.

కాల్వశ్రీరాంపూర్ మండలంలోని కూనారం వ్యవసాయ పరిశోధన స్థానంలో రూపొందించిన కేఎన్ఎం 7715, కేఎన్ఎం 1638, కేఎన్ఎం 12510 సన్న రకం వరి విత్తనాలు, ఎంజీ 295 రకం పెసర విత్తనాలను పంపిణీ చేశారు. ఒక్కో రెవెన్యూ గ్రామానికి ముగ్గురు ఆదర్శ రైతులను ఎంపిక చేశారు. 428 మంది రైతు లకు వరి విత్తనాలు, 214 మంది రైతులకు పెసర విత్తనాల సంచులను పంపిణీ చేశారు. ఈ విత్తనాలతో 214 ఎకరాల్లో వరి, 107 ఎకరాల్లో పెసర పంటను సాగు చేయనున్నారు. 10 కిలోల సంచులు వరి విత్త నాలు, 3 కిలోల సంచుల పెసర విత్తనాలను రైతు లకు అందజేశారు. ఈ విత్తనాలు అర ఎకరానికి వస్తాయని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

● పంటల సాగుపై పర్యవేక్షణ

రైతులకు అందించిన నాణ్యమైన విత్తనాలతో చేసే పంటల సాగును శాస్త్రవేత్తలతోపాటు వ్యవసాయ శాఖాధికారులు పర్యవేక్షించనున్నారు. విత్తనం విత్తిన దగ్గర నుంచి మొదలు పంట కోసే వరకు పంటలను పరిశీలించనున్నారు. సాగులో మెళకువలతోపాటు సస్య రక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులను అనుసరించడం, చీడపీడలు వస్తే తీసుకోవాల్సిన చర్యలు, నీటి యాజమాన్యం అంశాలపై రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇవ్వనున్నారు. పండించిన పంటను బయట మార్కెట్‌లో గానీ, ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో విక్రయించడానికి వీలు లేదు. ఆ పంటను విత్తనంగా అదే గ్రామంలో ఉన్న ఇతర రైతులకు తక్కువ ధరకు విక్రయించాల్సి ఉంటుంది. పంట చేతికి వచ్చిన తర్వాత వ్యవసాయ శాఖాధికారులు గ్రామాల్లో ఉండే రైతులందరినీ ఒక చోట సమావేశ పరిచి వ్యవసాయ పరిశోధనా స్థానాల్లో అభివృద్ధి చేసిన విత్తనాలు నాణ్యమైనవని, తద్వారా మంచి దిగుబడులు వస్తాయని, తక్కువ ధరకే విత్తనాలు లభిస్తాయని, చీడ పీడలు తట్టుకునే విధానాలు, తదితర అంశాల గురించి రైతులకు వివరించి ఆ విత్తనాలతోనే పంటలు సాగు చేయనున్నారు.

మిగతా 8వపేజీలో

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

జెమ్ వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష



బాలికలకు సర్టిఫికెట్లు అందిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

జ్యోతినగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బాలికలు అంకితభావంతో చదివి అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆకాంక్షించారు. ఎన్టీపీసీ ఆధ్వర్యంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న బాలికా సాధికారత మిషన్(జెమ్) శిక్షణా శిబిరం ముగిసింది. బుధవారం ఎన్టీపీసీ పీటీఎస్ కాకతీయ ఆడిటోరియంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ హాజరై ప్రసంగించారు. శిక్షణ పొందిన 120 మంది బాలికలు తాము ఎంచుకున్న రంగంలో రాణించేందుకు కృషి చేయాలన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలను ఎన్టీపీసీ మరిన్ని నిర్వహించాలన్నారు. శిక్షణ పొందిన బాలికలు తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని, వారికి స్ఫూర్తిని చ్చేలా వ్యవహరించాలని కోరారు. వర్క్‌షాప్‌ను విజయవంతం చేయడంలో కృషి చేసిన సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఎన్టీపీసీ తమకు ఏం చేయడం లేదని ప్రజల్లో ఉన్న అభిప్రాయాన్ని దూరం చేసేందుకు యాజమాన్యం చొరవ తీసుకోవాలన్నారు. చేసే మంచి పని ప్రజల్లోకి చేరేలా చూడడం కూడా ముఖ్యమన్నారు. ఐదు దశాబ్దాలుగా ఎన్టీపీసీ రాష్ట్రానికి, దేశానికి వెలుగులు పంచుతున్నదని పేర్కొన్నారు. ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్ సామంత ప్రసంగిస్తూ ఎన్టీపీసీ విద్యుత్ ఉత్పత్తితోపాటు సామాజికాభివృద్ధి కృషి చేస్తున్న దన్నారు. సీఎస్ఆర్ పథకం ద్వారా ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక నిధులు ఖర్చు చేస్తున్నామని ఈడీ తెలిపారు. బాలికల్లో ఆత్మ విశ్వాసం, భవిష్యత్‌లో రాణించేందుకు జెమ్ వర్క్‌షాప్‌ను యేటా నిర్వహిస్తున్నామని తెలిపారు. జానపద, శాస్త్రీయ, సినీ గీతాలపై విద్యార్థినులు నృత్యాలు ఆకట్టుకున్నాయి. శిక్షణ పొందిన బాలికలకు కలెక్టర్ సర్టిఫికెట్లు అందజేశారు. ఐఎన్టీయుసి జాతీయ కార్యదర్శి బాబర్ సలీంపాషా, దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు రాఖీ సామంత, జీఎంలు దేశాయ్, సింహరాయ, ఏజీఎం(హెచ్ఆర్) విజయ్ కుమార్ సిక్దర్, అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న బాలికలు

హాస్టళ్లను సిద్ధం చేయాలి

● సమీక్ష సమావేశంలో కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు ప్రారంభమవు తున్నందున ఈనెల 10వ తేదీలోగా హాస్టళ్లను సిద్ధం చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో రెసిడెన్షియల్ పాఠశాలల, కేజీబీవీల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ తర్వాత రెసిడెన్షియల్ పాఠశాలలకు పిల్లలు వస్తారని, అప్పటివరకు హాస్టల్స్, విద్యాసంస్థల వద్ద పారిశుధ్య పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. వర్షాకాలంలో హాస్టల్స్ వద్ద నీటి నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని రూమ్‌లలో ఫాగ్గింగ్ జరిగేలా కార్యదర్శులు, అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. పరిసరాలు పిచ్చి మొక్కలు తొలగించాలని, పాములు, తేళ్లు రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేయాలన్నారు. హాస్టల్ కిటికీలు మెష్ పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని, గోడలకు ఎక్కడైనా వాటర్‌లీక్ అవుతుందో పరిశీలించాలన్నారు. పాఠశాలలో ఉన్న ఆర్వో ప్లాంట్, ఫిల్టర్, మిషన్‌భగీరథ నీరు నాణ్యతతో వస్తుందో లేదో పరిశీలించాలన్నారు. ఒక చెక్‌లిస్ట్ తయారు చేసి ప్రతి అంశం పూర్తయ్యేలా చూడాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి



శాంతి కమిటీ సమావేశంలో ప్రసంగిస్తున్న డీసీపీ కరుణాకర్

కోల్‌సిటీ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలు కులమతాలకు అతీతంగా ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని పెద్దపల్లి డీసీపీ కరుణాకర్ పేర్కొన్నారు. బుధవారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో బక్రీద్ సందర్భంగా శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. డీసీపీ మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా పశువుల రవాణాకు ముందస్తుగా అనుమతులు తీసుకోవాలని, వెటర్నరీ డాక్టర్ సర్టిఫికెట్లు ఉండాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో పశువులను వధించినా, రవాణా చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. బక్రీద్ సందర్భంగా ప్రజలను రెచ్చగొట్టే విధంగా పుకార్లు సృష్టిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. సోషల్ మానిటరింగ్ సెల్ ద్వారా నిరంతరం నిఘా ఉంటుందన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మవద్దని, వాటిని ముందుగా ఎటువంటి సమాచారం తెలిసినా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఆవులు, లేగ దూడలను అమ్మినట్లయితే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. అన్నీ మతాల వారు సోదర భావంతో, ఐక్యతతో పండుగలు జరుపుకోవాలన్నారు. మత పెద్దలతో పాటు ఏసీపీ ఎం రమేష్, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, టుటౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ రావు, రామగుండం ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్ఐలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు కృషి చేయాలి



పదిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మండల టాపర్స్‌తో ఎమ్మెల్సీ, డీఈవో

పెద్దపల్లి కల్చరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణను అందరం బాధ్యతగా కృషిచేయాలని, మండల టాపర్లుగా నిలిచిన వారు పాఠశాలల్లో ప్రవేశాలు జరిగేలా అంబాసిడర్స్‌గా వ్యవహరించాలని ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు పింగలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంబి గార్డెన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రవేశాలు అధికంగా అయ్యేలా చూడాలని కోరారు. పీఆర్‌టీయు టీఎస్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఇటీవల పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రతిభా అవార్డుల ప్రదానంతో పాటు వందశాతం ఉత్తీర్ణత సాధించిన ప్రధానోపాధ్యాయులను సన్మానించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపేలా చూడాలన్నారు. డీఈఓ డి.మాధవి మాట్లాడుతూ ప్రతిభావంతులైన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను, ఉపాధ్యాయులను ప్రోత్సహించేందుకు పీఆర్‌టీయు జిల్లా శాఖ అవార్డుల ప్రదాన కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. జిల్లాశాఖ అధ్యక్షుడు కర్రు సురేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీఆర్‌టీయు రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి, డీసీఈబీ సెక్రటరీ వి.హన్మంతు, బి.రవినందన్‌రావు, పాల్గొన్నారు. 37మంది విద్యార్థులు, వందశాతం ఉత్తీర్ణత సాధించిన 66పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలను సర్టిఫికెట్, జ్ఞాపికతో సత్కరించారు.

డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

కాల్వశ్రీరాంపూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూంలు, నిరుపేదల అందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని బుధవారం డబుల్‌బెడ్‌రూం ఇండ్ల ఎదుట నిరసన, రాస్తారోకో నిర్వహించారు. తహసీల్దార్ జగదీశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు గూడెపు జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ డబుల్‌బెడ్‌రూంలు వస్తాయని ఆశపడ్డ నిరుపేదలకు ఇంతవరకు మంజూరు చేయలేదన్నారు. ఇందిరమ్మ ఇండ్లు కూడా నిరుపేదలందరికీ రాలేదని, గ్రామానికి 100ఇండ్లు మంజూరు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇంటికి ఇచ్చే రూ.5లక్షలను పెంచాలని, ఇళ్లు కట్టుకోవడానికి ముడిసరుకు, కూలీరేట్లు పెరిగిన కారణంగా నిరుపేదలు అప్పు చేయవలసి వస్తుందని తహసీల్దార్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ముల్కోజు వెంకటేశ్వర్లు, చల్ల చంద్రమౌళి, ఎండి.రఫీ, సుందర్‌రాజు, నల్వాల బాలకృష్ణ, కాల్వ రాధాకృష్ణారెడ్డి, కొమురయ్య, వైకుంఠం, ఆంజనేయులు, రాజ్‌కుమార్, తిరుపతిరెడ్డి, కిరణ్‌రెడ్డి, శివకుమార్, మహేందర్ పాల్గొన్నారు.

రోగులతో సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దపల్లిటౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులతో సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో మంథని ఆసుపత్రి పని తీరు పై సమావేశం నిర్వహించారు. మంథని ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ ఆశించిన స్థాయిలో లేదన్నారు. మాతా శిశు ఆసుపత్రి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పారిశుధ్య నిర్వహణ మెరుగుపర్చాలని, లేనిపక్షంలో కాంట్రాక్టర్ చెల్లింపులు నిలిపి వేస్తామని హెచ్చరించారు. సిబ్బంది పని తీరు మార్చుకోని పక్షంలో వేటు వేస్తామన్నారు. బయో మెట్రిక్ అటెండెన్స్ విధానం అమలు చేయాలని, రెగ్యులర్‌గా వైద్యుల హాజరు వివరాల నివేదికను సమర్పించాలని సూచించారు. మంథనిలో 20 కోట్లతో చేపట్టిన 50 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. పెద్దపల్లి పట్టణంలో 100 పడకల ఆసుపత్రి పనులు వర్షాకాలంలోపు ఒక బ్లాక్ పూర్తి చేయాలని సూచించారు. డీసీహెచ్‌వో శ్రీధర్, అధికారులు పాల్గొన్నారు.

ఎల్లంపల్లి భూముల కబ్జాపై కదిలిన అధికారులు

- 2024 డిసెంబర్ 20న వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'
- 70 ఎకరాలు కబ్జా అయినట్లు గుర్తింపు, ఆక్రమణల తొలగింపునకు ఆదేశాలు
- అక్రమార్కులపై పోలీస్ కేసు నమోదు : అదనపు కలెక్టర్ వేణు



ఎల్లంపల్లి భూముల కబ్జాపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

గోదావరిఖని/అంతర్గాం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు భూములను ఆరేళ్లుగా కబ్జాచేసి అక్రమంగా చేపల చెరువులు నిర్మించి చేపల పెంపకం చేపడుతున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతుండడంతో ఎట్టకేలకు జిల్లా అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. 2024 డిసెంబర్ 20న ఆంధ్రజ్యోతి జిల్లా ఎడిషన్‌లో 'ఎల్లంపల్లిలో భూములు కబ్జా' శీర్షికన అక్రమార్కుల వ్యవహారాన్ని వెలుగులోకి తీసుకవచ్చిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష రెవెన్యూ, నీటి పారుదల, సర్వే అండ్ ల్యాండ్ అధికారులచే జాయింట్ సర్వేకు ఆదేశించారు. దీంతో నీటి పారుదల శాఖాధికారులు పది రోజుల పాటు సర్వే చేశారు. ప్రాజెక్టు బ్యాక్ వాటర్ పరిధిలోని పొట్యాల, ఆకెనపల్లి, ముర్మూర్ పరిధిలో రైతులకు చెందిన భూములను లీజుకు తీసుకుని ప్రాజెక్టు బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌లోకి అక్రమంగా చొచ్చుకుని వెళ్లి చేపల చెరువులను నిర్మించినట్లుగా గుర్తించారు. అక్రమం గా విద్యుత్‌ను వాడుకోవడంతోపాటు ఎఫ్‌టీ ఎల్‌కు అడ్డుగా కట్టలువేసి, ప్రాజెక్టులోకి పైపులైన్లువేసి నీటిని తోడుతున్నట్లు గుర్తించారు. అప్పుడు నామ్‌కేవాస్తేగా వ్యవహరించిన అధికా రులు ఇది తమ పని కాదంటే తమది కాదని ఒకరిపై ఒకరు నెట్టేసుకున్నారు. ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోకపోవడంతో అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో బుధ వారం అదనపు కలెక్టర్ డివేణు, అంతర్గాం తహసీల్దార్ తూము రవీందర్, నీటిపారుదల శాఖాధికారులు శ్రీపాద ఎల్లంపల్లిని సందర్శించి అక్రమంగా నిర్మించిన చేపల చెరువులను పరిశీలించారు. అనుమతులు లేకుండా చేపల చెరువులను నిర్మించారని, 70 ఎకరాల ప్రాజెక్టు భూములను కబ్జా చేసినట్లుగా సర్వే ద్వారా గుర్తించామని అదనపు కలెక్టర్ తెలిపారు. ఆక్రమణలను తొలగించి భూములను స్వాధీనం చేసుకోవాలని నీటి పారుదల శాఖాధికారులను ఆదేశించారు. అలాగే ప్రాజెక్టు నుంచి నీటిని లిఫ్ట్ చేస్తున్న మోటార్లను నిలిపి వేయాలని ఎన్‌పీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసిన చేపల చెరువులు నిర్మించిన వారిపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని అదనపు కలెక్టర్ డి వేణు విలేకరులకు తెలిపారు.



శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు సంబంధించిన పత్రాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ డి వేణు

డివిజన్ల పునర్విభజనలో లోపించిన పారదర్శకత
● జాబితాలో చోటుచేసుకోని బ్లాకులు
8
ఓదెల, కాల్వశ్రీరాంపూర్‌లో టిప్పర్లను అడ్డుకొన్న గ్రామస్థులు

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

సిరిసిల్ల రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో అలువాల కనకయ్య(60) అనేవ్యక్తి కార్గిల్ లేక్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపినవివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన అలువాల కనకయ్య జీవనోపాధి కోసం పాన్‌షాపును ఏర్పాటు చేసుకున్నాడు. షాపుకోసం చేసిన అప్పులు పెరిగిపోవడంతో పాటు పాన్‌షాపు సక్రమంగా నడవకపోవడంతో చేసిన అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో కనకయ్య ఈనెల 2న రాత్రి 8.30 గంటలకు ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అతడి కోసం కుటుంబ సభ్యులు గాలించినా అడ్రస్ దొరకకపోవడంతో పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదుచేశారు. బుధవారం పట్టణ శివారులోని కార్గిల్‌లేక్‌లో మృతదేహం కనిపించడంతో చూసిన వాళ్లు పోలీసులకు సమాచారం అందించారు. ఆర్థిక ఇబ్బందులతోనే ఆత్మహత్య చేసుకున్నట్లుగా కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

అప్పులు తీర్చలేక యువకుడి బలవన్మరణం


రామకృష్ణ(ఫైల్)

సిరిసిల్ల రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : జల్సాలకు కోసం చేసిన అప్పులు తీర్చలేక బుధవారం రాపెల్లి రామకృష్ణ(24) అనే యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సిరిసిల్ల పట్టణంలోని గణేష్‌నగర్‌లో జరిగింది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గణేష్‌నగర్‌కు రాపెల్లి లింగంకు కుమారుడు రామకృష్ణ, కూతురు మానస ఉన్నారు. రామకృష్ణ పలు దుకాణాల్లో పనిచేస్తున్నాడని తెలిపారు. అయితే స్నేహితులతో జల్సాలకు అలవాటు పడిన రామకృష్ణ వచ్చిన జీతంతో పాటు ఆన్‌లైన్‌లో లోన్ యాప్‌ల నుంచి అప్పులు తీసుకునేవాడని తెలిపారు. ఆన్‌లైన్ లోన్ అప్పులు పెరిగిపోవడంతో తీర్చేమార్గం కనిపించక బుధవారం తెల్లవారుజామున ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తెల్లవారిన తరువాత కుటుంబ సభ్యులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి పోలీసులు వెళ్లి ఆత్మహత్య చేసుకున్న రామకృష్ణ మృతదేహాన్ని పరిశీలించారు. తండ్రి లింగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

పెద్దపల్లి రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి మండలంలోని భోజన్నపేట గ్రామానికి చెందిన చిట్యాల కొమురమ్మ (70)చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. కొమురమ్మ, ఆమె అల్లుడు మల్లారపు రాములుతో కలిసి పెద్దపల్లి నుంచి సుద్దాలలో ఉన్న బంధువుల ఇంటికి మంగళవారం ద్విచక్ర వాహనంపై వెళుతోంది. పెద్దకల్వల వద్ద ఓ వ్యక్తి నిర్లక్ష్యంగా ద్విచక్ర వాహనం నడుపుతూ వీరి వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో ద్విచక్ర వాహనంపై నుంచి ఇద్దరు కిందపడ్డారు. రాములు కాలుకు గాయం కాగా కొమురమ్మ తలకు గాయాలయ్యాయి. స్థానికులు పెద్దపల్లి ఆసుపత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం కొమురమ్మను హైదరాబాద్ తరలించగా బుధవారం చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి అల్లుడు మల్లారపు రాములు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు.

జీవాల ఎరువుతో భూసారం

- అధిక దిగుబడి కోసం అన్నదాతల మొగ్గు
- ఉపాధి పొందుతున్న గొల్ల, కురుమలు


వెల్గటూర్ మండలంలో ఓ పొలంలో మేకలు, గొర్రెల మంద

వెల్గటూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): భూసార లోపాన్ని అధిగమించేందుకు అన్నదాతలు జీవాల ఎరువుపై దృష్టి సారిస్తున్నారు. గతంలో పాడి పశు వుల ఎరువును పొలాలకు ఉపయోగించుకునే వారు. తగ్గిన పశు సంపదతో రైతులు తమ పొలాలకు ఎరువును వేయకపోవడంతో భూసారం తగ్గి పంట దిగుబడి తగ్గుతోంది. దీంతో రైతులు గొర్రెలు, మేకల మందను తమ పంట క్షేత్రాల్లో పెట్టుకొని ఎరువును పొందుతున్నారు. కొందరు యాదవులకు ప్రభుత్వం గొర్రెలను పంపిణీ చేయడంతో వాటిని పొలాల్లో రాత్రి సమయాల్లో ఎరువు కోసం ఉంచుతూ గొల్ల, కురుమలు ఉపాధి పొందుతున్నారు.

జీవాల ఎరువుపై అన్నదాతల దృష్టి

జీవాల ఎరువుపై అన్నదాతలు దృష్టి సారిస్తున్నారు. జీవాలను ఒక రోజు పొలంలో ఉంచితే ఎకరం పొలానికి ఎరువు సరిపోతుంది. ఇందుకు రైతుకు సుమారు రూ2 వేల వరకు ఖర్చు అవుతుంది. తక్కువ ఖర్చుతో పొలం సారవంతం అవుతుందని అన్నదాతలు వాటి కోసం పోటీ పడుతున్నారు. పొలం లో గొర్రెలు, మేకల మంద వదిలితే పేడ, మూత్రంతో భూమికి సేంద్రియ పదార్థం లభిస్తుంది. గొర్రె పేడలో పీచుపదార్థం ఎక్కువగా ఉండడం వల్ల మొక్కల వేర్లు భూమి లోపలికి సులువుగా వెళ్లి తొందరగా మొక్క ఎదుగుతుందని రైతులు చెబుతున్నారు.

భూమి సారవంతం

జీవాల మూత్రంలో పీహెచ్ 7.7 ఉండడం వల్ల భూమిలో ఉన్న చౌడు కూడా పోయి భూమి గుల్ల బారడంతో పాటు సారవంతంగా తయారవుతుంది. ఒక లీటరు మూత్రంలో 3 నుంచి 13 గ్రాముల నత్రజని, 18 నుంచి 20 గ్రాముల పొటాషియం, పాస్పరస్ ఉంటాయి. గొర్రె లేదా మేక ఒక రాత్రికి లీటరు మూత్రం విసర్జిస్తుందని పశు వైద్యాధికారులు అంటున్నారు. ఈ ఎరువు వల్ల భూమిలో తేమ శాతం నిలువ ఉండి తడులు తక్కువగా పడతాయి. ఒక్క ఏడాది జీవాల ఎరువు వాడితే మూడేళ్ల వరకు అవసరం ఉండదని రైతులు అంటున్నారు.

అధిక దిగుబడి

సాయికిరణ్, ఏవో, వెల్గటూర్



జీవాల ఎరువుతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చు. దుక్కులు దున్నక ముందే జీవాల ఎరువు వేయించి కలయదున్నాలి. ఇది పొలానికి బలాన్ని అందిస్తుంది. ఏటా జీవాల ఎరువు వేయడం వల్ల భూసారం పెరుగుతుంది.

భూసారం పెరుగుతుంది..

వంజరి గంగయ్య, రైతు, వెంకటాపూర్



జీవాల ఎరువుతో భూసారం పెరుగుతుంది. రసాయన ఎరువులను అధికంగా వాడటం వల్ల దిగుబడి ఏటా తగ్గుతోంది. రెండేళ్లుగా జీవాల ఎరువు వేయిస్తున్నాను. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించా. తక్కువ ఖర్చుతో పంటలు మంచి దిగుబడి వస్తున్నాయి.

ఇద్దరు కానిస్టేబుళ్లకు చార్జి మెమోలు

- ట్రైనీ ఎస్ఐపై క్రమశిక్షణ చర్యల కోసం ఐజీకి నివేదిక

కరీంనగర్ క్రైం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆకాష్, అజయ్ అనే కానిస్టేబుళ్లకు సీపీ గౌస్ ఆలం చార్జి మెమోలు జారీ చేశారు. వారిద్దరిని విధుల నుంచి తొలగించి పోలీస్‌హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. శిక్షణ ఎస్ఐ అగస్త్య భార్గవ్‌పై క్రమశిక్షణ చర్యల నిమిత్తం మల్టీ జోన్ ఐజీకి నివేదిక పంపించారు. ఈ మేరకు బుధవారం సీపీ ఒక ప్రకటన విడుదల చేశారు. మే8న సైదాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో ప్రొబెషనరీ ఎస్ఐ అగస్త్య భార్గవ్, కానిస్టేబుళ్ల ఆకాష్, అజయ్ వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో అటుగా వస్తున్న హుస్నాబాద్‌కు చెందిన బత్తుల మహేందర్ ద్విచక్ర వాహనాన్ని నిలిపి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మహేందర్ తమపై దుర్భా షలాడుతూ విధులకు ఆటంకం కలిగించాడని కానిస్టేబుల్ అజయ్ సైదాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఈ మేరకు కేసు నమోదు చేశారు. అనంతరం మహేందర్ కానిస్టేబుళ్లు, ప్రొబేషనరీ ఎస్ఐ తనపై దాడి చేశారని సీపీకి ఫిర్యాదు చేశాడు. దీనిపై హుజూరాబాద్ ఏసీపీని పూర్తి స్థాయిలో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపి నివేదిక సమర్పించాలని సీపీ ఆదేశించారు. విచారణ అనంతరం ఏసీపీ సమర్పించిన నివేదిక ఆధారంగా, వాహన తనిఖీలు జరుగుతున్నప్పుడు బత్తుల మహేందర్ తన వాహనాన్ని ఎందుకు ఆపారని ప్రశ్నించాడని, పోలీసులను దూషిస్తూ, విధులకు ఆటంకం కలిగించారని తేలిం దిని సీపీ తెలిపారు.

ఈ క్రమంలో పోలీసులు, వాహనదారుడికి మధ్య వాగ్వాదం జరిగింది. పరిస్థితిని అదుపు చేయడానికి పోలీసులు అవసరానికి మించి బలప్రయోగం చేశారని వెల్లడైందని సీపీ వివరించారు. మహేందర్ ఫిర్యాదు మేరకు ఆ రోజు విధుల్లో ఉన్న కానిస్టేబుళ్ల ఆకాష్, అజయ్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు సీపీ తెలిపారు. ఈ ఘటనపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని వస్తున్న కథనాలు పూర్తి అవాస్తవమని కమిషనర్ స్పష్టం చేశారు. చట్టం ముందు అందరూ సమానమేనని, తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం అన్నారు.

కారును ఢీ కొట్టిన లారీ

- ఒకరికి తీవ్ర గాయాలు.. ఇద్దరికి స్వల్ప గాయాలు

శంకరపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మొలంగూర్ ఎక్స్‌రోడ్ వద్ద కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున లారీ కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా, మరోఇద్దరు వ్యక్తులు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశవపట్నం నుంచి హుజూరాబాద్‌కు వెళ్తున్న కారును ఏలూరు నుంచి కరీంనగర్‌కు వెళ్తున్న లారీ ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న రాయికల్ తండాకు చెందిన భూక్య ప్రశాంత్ తలకు గాయాలు కాగా, సింగాపూర్‌కుచెందిన నీరటి త్రిశూల్, అక్కన్నపేటకు చెందిన కాస్లోత్ జయంత్ కుమార్‌కు స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. గాయపడిన క్షతగాత్రులను 108వాహనంలో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ బైండోవర్

కరీంనగర్ క్రైం, జూన్ 4 (ఆంధ్ర జ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తూ పట్టుబడిన ట్రాక్టర్ డ్రైవర్ గొల్లపల్లికి చెందిన బోనగిరి చిరంజీవిని బుధవారం పట్టుకుని కరీంనగర్‌రూరల్ తహసీల్దార్ ఎదుట హాజరు పరచినట్లు కరీంనగర్ రూరల్‌సీఐ ఏ నిరంజన్‌రెడ్డి తెలిపారు. లక్ష రూపాయల స్వంత పూచీకత్తుపై బైండోవర్‌చేసినట్లు తెలిపారు. ఇసుక అక్రమ రవాణా మానేయాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

సెల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్‌క్రైం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లికి చెందిన కాటా అజయ్ అనేవ్యక్తి ఏడాది క్రితం తనసెల్‌ఫోన్ పోగొట్టుకోగా కరీంనగర్ రూరల్ పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితుడికి బుధవారం అప్ప గించారు. సెల్‌ఫోన్‌ను ట్రేస్‌చేసి పట్టుకోవటంలో కృషిచేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.

ట్రాక్టర్ షోరూంకు తాళం వేసిన రైతు

పెద్దపల్లిటౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): జూలపల్లి మండలం పెద్దపూర్ గ్రామానికి చెందిన పెద్దులు అనే రైతు ట్రాక్టర్ షోరూంలో 35 లక్షల రూపాయలతో హార్వెస్టర్ కొనుగోలు చేశాడు. 1200 గంటలు నడిపించాక క్లచ్‌ప్లేట్లు మార్చాలని షోరూం సిబ్బంది తెలిపారు. అయితే క్లచ్‌ప్లేట్లు మార్చినప్పుడల్లా 40వేల రూపాయలు ఖర్చు అవుతుందని సూచించారు. షోరూం నిర్వాహకులు చెప్పిన సమయం గడవక ముందే 8సార్లు క్లచ్‌ప్లేట్లు మార్చినట్లు రైతు పేర్కొన్నాడు. షోరూం చుట్టు తిరిగి నష్టపోయానని, సుమారు నాలుగు లక్షల రూపాయలు ఖర్చు చేసినట్లు తెలిపాడు. దీంతో బుధవారం హార్వెస్టర్‌ను తీసుకువచ్చి షోరూంలో ఎందుకిలా అవుతుందని ప్రశ్నించగా సమాధానం రాకపోవడంతో హార్వెస్టర్‌ను షోరూం లోపలి పెట్టి తాళం వేసినట్లు తెలిపాడు. తనకు న్యాయం చేయాలని కోరాడు.

లంచం డిమాండ్ చేసిన డాక్టర్ సస్పెన్షన్

మంథని, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ చేయించుకునేందుకు వచ్చిన పేషెంట్ దగ్గర లంచం డిమాండ్‌చేసిన మంథని ప్రభుత్వ ఆసుపత్రి అనస్తీషియా డాక్టర్‌గా పనిచేస్తున్న రామోహన్‌రావును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. రామోహన్‌రావు మండలంలోని రచ్చపల్లి గ్రామానికి కోడాలి భాగ్యకు ప్రభుత్వఆసుపత్రిలో ట్యూబెక్టమీ ఆపరేషన్ కోసం రూ.5వేలులంచం డిమాండ్‌చేసి దొరికిపోయాడని, సదురుడాక్టర్‌పై ఇప్పటికే పలు ఫిర్యాదుల నేపథ్యంలో డాక్టర్ రామోహన్‌రావును సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రేషన్ డీలర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

ధర్మారం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వివాహం అనంతరం రేషన్ కార్డులో పేరు లేదని చెప్పి 9 సంవత్సరాలుగా బియ్యం అమ్ముకుంటున్న రేషన్ డీలర్‌పై ఓ మహిళా కలెక్టర్ ఫిర్యాదు చేసింది. మల్లాపూర్ గ్రామానికి చెందిన కట్టకోల కరుణకు తల్లి పేరుతోపాటు తెల్ల రేషన్ కార్డు ఉంది. 2016లో కరుణకు వివాహం జరుగగా కార్డులో పేరు లేదని రేషన్ డీలర్ నమ్మబలికాడు. ఇద్దరి పేరున ప్రతీ నెల 12కిలోల బియ్యం ఇవ్వాల్సి ఉండగా కరుణ వివాహ అనంతరం తల్లి విజయకు మాత్రమే 6కిలోల బియ్యం ఇస్తున్నాడు.

ఇటీవల నూతన రేషన్ కార్డు కోసం కరుణ భర్త దరఖాస్తు చేసుకోగా ఇది వరకే కార్డు ఉన్నట్లు మీసేవలో చూపించింది. అనుమానం వచ్చిన కరుణ తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించగా పేరు డెలిట్ కాలేదని, ఈనెల బియ్యం తీసుకోవచ్చని అధికారులు తెలిపారు. దీంతో కరుణ రేషన్ షాపు వెళ్ళి ఆరాతీయగా ఇద్దరి పేరున కలిపి 12కిలోల బియ్యాన్ని డీలర్ ఇచ్చాడు. 9సంవత్సరాలుగా తనకు బియ్యం ఇవ్వకుండా అక్రమాలకు పాల్పడిన రేషన్‌డీలర్ కట్టెకోల నర్సయ్యపై చర్యలు తీసుకోవాలని కరుణ బుధవారం కలెక్టర్ కోయ శ్రీహర్షకు ఫిర్యాదు చేసింది. తనకు రేషన్ కార్డులేదనే భావనతో రాజీవ్ యువవికాసం పథకానికి కూడా దరఖాస్తు చేసుకోలేదని పేర్కొంది.

సైబర్ నేరగాళ్ల వలలో యువకుడు

- రూ.5,39,000 పోగొట్టుకున్నవైనం

జగిత్యాల క్రైం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల వలలోపడి ఓ యువకుడు మోసపోయాడు. జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లికి చెందిన ప్రవీణ్ కుమార్ అనే యువకుడు ఆన్‌లైన్‌లో ఓ ఫ్రాంచైసీకోసం వెబ్‌సైట్‌లో వెదికాడు. దీన్ని గమనించిన సైబర్ నేరగాళ్లు ప్రవీణ్‌కు ఫోన్ చేసి ఫ్రాంచైసీ కోసం రూ.5,39,000 చెల్లించాలని కోరారు. వారిని నమ్మిన ప్రవీణ్ వారం రోజుల వ్యవధిలో రెండు విడతల్లో డబ్బులు పంపాడు. రోజులు గడుస్తున్నా ఫ్రాంచైసీ రాకపోవడంతో మోసపోయానని తెలుసుకుని పట్టణ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. టౌన్ సీఐ కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు పేర్కొన్నారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

కాల్వశ్రీరాంపూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తారుపల్లి గ్రామానికి చెందిన 15మంది గుడుంబా విక్రయదారులను బుధవారం ఎక్సైజ్ పోలీసులు తహసీల్దార్ జగదీశ్వర్‌రావు ఎదుట బైండోవర్ చేశారు. గుడుంబా అమ్మితే లక్ష రూపాయల వరకు జరిమానా ఉంటుందని ఎక్సైజ్ సీఐ గురునాథ్ తెలిపారు. ఎవరైన గుడుంబా అమ్మితే 8712658819 నంబర్‌కు సమాచారం అందించాలని మండల ప్రజలకు సీఐ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శంకర్, ఎస్సైలు రాజు, చిరంజీవి, వెంకటేశ్వర్‌రావు, పావని, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గల్ఫ్ ఏజెంట్ మోసం

- చందుర్తి పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

చందుర్తి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): డాటా ఎంట్రీ ఉద్యోగం పేరిట గల్ఫ్‌ఏజెంట్ తనను మోసం చేశాడంటూ చందుర్తి మండలంలోని నర్సింగాపూర్‌కు చెందిన ఓ యువకుడు బుధవారం పోలీసులను ఆశ్రయించారు. చందుర్తి పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన జువ్వాడిరాజశేఖర్ అనే యువకుడు గల్ఫ్ వెళ్లేందుకు తన మిత్రుడైన కోరుట్లకు చెందిన రాజు అనే వ్యక్తిని సంప్రదించాడు. అతను వైజాగ్‌కుచెందిన ఉప్పుల రాంబాబును పరిచయం చేశాడు. రాంబాబు లావోస్ దేశంలో ఓ కంపెనీలో డాటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగం ఉందని చెప్పి కొంత డబ్బు తీసుకొని 9 అక్టోబర్ 2024న లావోస్ దేశం పంపించాడు. అక్కడికి వెళ్లాక వారు ఫోన్లు చేస్తూ సైబర్ నేరాలకు పాల్పడాలని సూచించారు. దీంతో రాజశేఖర్ ఆ పనిచేయలేక అక్కడినుంచి తప్పించుకొని మరో ప్రాంతానికి వెళ్లి డెలివరీ బాయ్‌గా పనిచేశాడు. అనంతరం అక్కడ ఎంబసీని సంప్రదించాడు. వారి సహాయంతో తిరిగి గతనెల28 ఇండియాకు చేరుకున్నాడు. బుధవారం చందుర్తి పోలీస్ స్టేషన్‌లో రాజశేఖర్ ఫిర్యాదుచేయగా, కోరుట్లకు చెందిన రాజుతోపాటు వైజాగ్‌కు చెందిన ఉప్పుల రాంబాబులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైరమేష్ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

- సంఘటన స్థలంలోనే ఒకరు మృతి
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు


బోల్తా పడ్డ కారు


మోతుకూరి రవీందర్(ఫైల్)

తిమ్మాపూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని నుస్తులాపూర్ గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి ఓ కారు బీభత్సం సృష్టించింది. రోడ్డుదాటుతున్న బైక్‌ను కారు అతి వేగంగా ఢీకొని కొద్దిదూరం వరకు ఈడ్చుకెళ్లింది. ఎల్ఎండీ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం నుస్తులాపూర్ గ్రామానికి చెందిన మోతుకూరి రవీందర్, వేనంక నరేష్, బేతి వినయ్ కిరణ్‌రెడ్డి ముగ్గురు పనిమీద బైక్‌పై బయటకు వెళ్లి తిరిగి తమ ఇళ్లకు వెళుతున్నారు. ఈ క్రమంలో రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపునకు అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన కారు వెనకాల నుంచి వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్నవారిలో ఇద్దరు ఎగిరికింద పడిపోగా బైక్‌తో పాటు ఒకరిని కారు కొద్దిదూరం వరకు ఈడ్చుకుంటూ రోడ్డు పక్కన ఉన్న రేయిలింగ్‌ను ఢీకొంటు వెళ్లి ఓ చెట్టునుఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మోతుకూరి రవీందర్(33) సంఘటనలో స్థలంలోనే మృతి చెందగా, వేనంక నరేష్, బేతి వినయ్‌కిరణ్ రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్ఎండీ పోలీసులు, స్థానికుల సహాయంతో గాయపడ్డ వారిని వెంటనే కరీంనగర్‌లోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుల కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్ఎండీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

- గ్రామంలో విషాదచాయలు..

ప్రమాదంలో ముగ్గురూ నుస్తులాపూర్ గ్రామానికి చెందిన యువకులే కావడంతో గ్రామంలో తీవ్రవిషాద చాయలు అలుముకొన్నాయి. మోతుకూరి రవీందర్ కరీంనగర్‌లోని ఓ కార్ షోరూంలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య వెన్నెల, ఇద్దరు 6, 4సంవత్సరాల వయసు ఉన్న కుమారులు ఉన్నారు. మృతిచెందిన వేనంక నరేష్ బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. గత శనివారమే గ్రామంలో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు నరేష్ వచ్చాడు. వచ్చిన నాలుగు రోజులకే రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. నరేష్ తమ్ముడు ఏడాదిక్రితం ఆత్మహత్య చేసుకొని మృతి చెందగా, తిరిగి నరేష్ రోడ్డుప్రమాదంలో మృతి చెందడంతో అతని కుటుంబసభ్యులు దుఃఖ సాగరంలో మునిగిపోయారు. తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బేతి వినయ్ కిరణ్‌రెడ్డి గత మే 21న వివాహం జరిగింది. మృతుల ఇళ్ల వద్ద కుటుంబ సభ్యులు రోధనలు మిన్నంటాయి.


ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన ద్విచక్రవాహనం

అప్పుల బాధతో ఒకరి బలవన్మరణం


సతీష్‌కుమార్ (ఫైల్)

జూలపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తేలుకుంట గ్రామానికి చెందిన కోడూరి సతీష్‌కుమార్ (38) అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సతీష్‌కుమార్ కొన్నేళ్లుగా పలు వ్యాపారాలు నిర్వహించినా నష్టాలు రావడంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం మధ్యాహ్నం పురుగుల మందుతాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సనత్‌కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


కూకట్ల రమేష్(ఫైల్)

సుల్తానాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి గ్రామానికి చెందిన కూకట్ల రమేష్ (35) అనే యువకుడు బైక్‌పై వస్తుండగా అదుపు తప్పి చెట్టును ఢీకొని మృతిచెందిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. రమేష్ పని నిమిత్తం సాయంత్రం సమీపంలోని శివపల్లి గ్రామానికి వెళ్లి వస్తుండగా దారిలో రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొని కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లావణ్య, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి


రాజవ్వ (ఫైల్)

పెగడపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలంలోని నార్సింహాని పేటలో బుధవారం బస్సు ఢీకొని మ్యాన రాజవ్వ(75) అనే వృద్ధురాలు మృతి చెందింది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మల్యాల గ్రామానికి చెందిన రాజవ్వ బుధవారం తన తల్లి గారింటికి వచ్చి తిరిగి వెళ్తూ బస్సు ఎక్కే క్రమంలో బస్సు కిందపడి మృతి చెందింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రవీందర్ తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు: ఒకరి మృతి


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు


శివసాయి(ఫైల్)

ఐనవోలు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆగిఉన్న లారీని కారు ఢీకొట్టిన ఘటనలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతిచెందిన సంఘటన పంథిని గ్రామంలో వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. గోదావరిఖని పట్టణానికి చెందిన చింతకింది శివసాయి(29) ఖమ్మంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. గోదావరిఖనిలో శుభకార్యం ఉండగా మంగళవారం అర్ధరాత్రి ఖమ్మం నుంచి కారులో ఒక్కడే బయలుదేరాడు. ఖమ్మం నుంచి వరంగల్ వైపు వెళ్తున్న లారీ పంథిని హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదుట రోడ్డుపై నిర్లక్ష్యంగా నిలిపాడు. ఎదురుగా వాహనం రావడంతో లైట్ల వెలుతురులో ఆగి ఉన్న లారీ కనిపించని కారణంగా శివసాయి కారు ఆగిఉన్న లారీని బలంగా ఢీకొంది. కారు నడుపుతున్న శివసాయి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని శివసాయి మృతదేహాన్ని బయటకి తీసి ఎంజీఎంకు తరలించి ప్రమాదానికి గురైన వాహనాలను రోడ్డుపై నుంచి తొలగించారు. మృతుడికి తల్లిదండ్రులు రాజమణి-రమేష్ బాబు, ఇద్దరు అక్కలు ఉన్నారు. యువకుడి మృతిని బంధువులు, స్నేహితులు జీర్ణించుకోలేకపోతున్నారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్సకు స్పందిస్తున్న కోడెలు

- అనారోగ్యంతో ఒక కోడె మృతి
- రాజన్న క్షేత్రం గోశాల హెల్త్ బులిటెన్

సిరిసిల్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం పరిధిలోని తిప్పాపూర్ గోశాలలో అనారోగ్యం బారిన పడిన కోడెలు వైద్య చికిత్సకు స్పందిస్తున్నాయని జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. అకాల వర్షాలు, అనారోగ్య పరిస్థితుల కారణంగా మృత్యువాత, చికిత్స పొందుతున్న కోడెల పరిస్థితిపై బుధవారం హెల్త్ బులిటెన్ విడుదల చేశారు. బుధవారం తిప్పాపూర్ గోశాలలో ఒక కోడె మృతిచెందినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు 26 పశువులు మృతిచెందాయని, 14 పశువులు అనారోగ్యంతో బాధపడుతున్నాయని తెలిపారు. వైద్యానికి పశువులు స్పందిస్తున్నాయని, కొన్ని మళ్లీ ఆరోగ్యంగా తిరుగుతున్నాయన్నారు. కోడెల ఆరోగ్యంపై చర్యలు తీసుకుంటున్నామన్నారు.

చిరుత సంచారంపై అవగాహన

గంభీరావుపేట, జూన్ 4 ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోరంటాల, దమ్మన్నపేట గ్రామాల్లో చిరుత సంచారంపై ఫారెస్ట్ అధికారులు ప్రజలకు బుధవారం అవగాహన కల్పించారు. జిల్లా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీహరి ప్రసాద్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ అంజలి గ్రామస్థులకు చిరుతతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇటీవల దమ్మన్నపేట గ్రామ సమీప ప్రాంతాల్లో చిరుత దూడపై దాడి చేసి చంపేసింది. దీంతో ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి అంజలి సంఘటన స్థలం వద్దకు వెళ్లి పరిశీలించారు. అప్పట్లో ముచ్చర తదితర గ్రామాల్లోని సమీప అడవుల్లో చిరుత సంచరించి గేదెలు, దూడలపై దాడులు చేసి చంపేయడంతో ప్రజలు ఆందోళన చెందారు. దమ్మన్నపేటలో దూడను చిరుత చంపేయడంతో ఫారెస్ట్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. గేదెలను, దూడలను, మేకలను ఇంటి వద్దే కట్టేసుకోవాలని సూచించారు. గుట్ట సమీపాన ఉన్న పొలాల వద్ద కట్టేయవద్దని తెలిపారు.

వృక్షో రక్షతి రక్షితః



- అంతరించిపోతున్న అడవులు
- పెరుగుతున్న కాలుష్యం..
- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

పర్యావరణం రోజురోజుకు దెబ్బతింటోంది. విచక్షణ రహితంగా వృక్షాలను నేలకూల్చుతుండడంతో అడవులు అంతరించిపోతున్నాయి. వన్యప్రాణుల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతోంది. చెట్ల నరికివేతతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 1972లో ఐక్యరాజ్యసమితి మొదటిసారిగా పర్యావరణానికి సంబంధించిన సమావేశాన్ని నిర్వహించింది. ప్రతి సంవత్సరం ఒక లక్ష్యాన్ని ప్రకటించి దానిపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ సంస్థ 1984లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా నెహ్రూ ఫౌండేషన్, మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ ఫారెస్ట్ సహాయంతో ప్రకృతి సహజ వనరుల సక్రమ వినియోగంపై ప్రజలను చైతన్యపరుస్తోంది. ప్రకృతి వైపరీత్యాలు ఒకేసారి సంభవించడం, ఆలస్యంగా వర్షాలు కురిసి రైతులు ఆర్థికంగా నష్టపోవడం జరుగుతోంది.

పెరుగుతున్న ప్లాస్టిక్ వాడకం..

పర్యావరణ విఘాతానికి ప్లాస్టిక్ వాడకం ప్రధాన కారణమవుతోంది. రోజురోజుకు ప్లాస్టిక్ కవర్ల వాడకం పెరుగుతోంది. వస్తువులను కొనుగోలు చేసి తీసుకొని వెళ్లడానికి ప్లాస్టిక్ కవర్లను ఉపయోగిస్తున్నారు. ప్రభుత్వం నిబంధనలతో కూడిన నిషేధం ఉన్న అమలు కావడం లేదు. ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేధించి జనపనార సంచులు, బట్ట సంచులను ఉపయోగించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వల్ల అవి మట్టిలో కలిసిపోకుండా కొన్ని వేల సంవత్సరాలు భూమిలోనే ఉంటూ భూమిసారాన్ని దెబ్బతీస్తుంది. ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకొని ప్లాస్టిక్‌ను నివారించాల్సిన అవసరం ఉంది. ఈసారి ఐక్యరాజ్య సమితి ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని ఓడించండి అనే థీమ్‌తో అవగాహన కార్యక్రమాలను చేపట్టనుంది.



నామమాత్రంగా చర్యలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్లాస్టిక్ నిషేధం నామమాత్రంగా అమలవుతోంది. ఏవైనా ఫిర్యాదులు వచ్చినప్పుడు అధికారులు దాడులు చేయడం.. రెండు మూడు రోజుల తర్వాత తిరిగి అమ్మడం సాధారణమైపోయింది. దుకాణాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను విచ్చలవిడిగా వాడుతున్నారు. మున్సిపాలిటీల్లో వెలువడే చెత్తలో అధికభాగం ప్లాస్టిక్ పదార్థాలే ఉంటున్నాయి. అవి భూమిలో కలిసిపోకపోవడంతో గుట్ట గుట్టలుగా చెత్త పేరుకుపోతోంది. ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఇదే ప్రధాన సమస్యగా తయారైంది. అడవుల సంరక్షణకు తీసు కుంటున్న చర్యలు ఫలితాలనివ్వడం లేదు. అక్రమార్కులు యథేచ్ఛగా చెట్లను నరికి వేస్తున్నారు. కోట్లు ఖర్చు పెట్టి నాటుతున్న మొక్కల సంరక్షణను పట్టించుకోకపోవడంతో అవి సంవత్సరంలోపే ఎండిపోతున్నాయి.

పర్యావరణ ప్లాస్టిక్ రీసైక్లింగ్‌పై 'కందేపి'..



సిరిసిల్లకు చెందిన బాల సాహితీవేత్త డాక్టర్ కందేపి రాణీప్రసాద్ పర్యావరణ పరిరక్షణలో ప్రజల కు అవగాహన కల్పించే దిశగా ప్లాస్టిక్ రీసైక్లింగ్‌పై పుస్తకాలు, వివిధ రకాల బొమ్మలతో అవగాహన కల్పి స్తున్నారు. ప్లాస్టిక్ వల్ల జరిగే అనర్థాలను తెలుపుతూ ప్లాస్టిక్ రీసైక్లింగ్ బొమ్మలతో ప్రదర్శనలు నిర్వహిం చారు. 550కు పైగా రీసైక్లింగ్ బొమ్మలు తయారు చేశారు. రాణీప్రసాద్ పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. సైన్స్ ప్లానెట్ పేరుతో ప్లాస్టిక్ వల్ల జరిగే అనర్థాలను తెలియజేశారు.



కరీంనగర్ డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న పొగ

పీజీ పరీక్షల ఫీజు షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలోని అన్ని పీజీ కళాశాలల ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ, సోషల్‌వర్క్, ఎంబీఏ, ఎంసిఏ విభాగాలలో రెండవ, నాల్గవ సెమిస్టర్ పరీక్షల ఫీజు షెడ్యుల్‌ను బుధవారం శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డా. సురేష్ కుమార్ విడుదల చేశారు. పరీక్షలు రాయదలచిన అభ్యర్థులు పరీక్ష ఫీజు కట్టవలసిందిగా ఆయా కళాశాలలకు ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు జూలై నెల ఆఖరి వారంలో జరుగుతాయని, ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల12 వరకు పరీక్ష రుసుము చెల్లించవచ్చన్నారు. 300 రూపాయల అపరాధ రుసుముతో ఈ నెల 17 వరకు ఆయా కళాశాలలో, ఆన్‌లైన్ పద్ధతిలో చెల్లించవచ్చని తెలిపారు. 2016-17 బ్యాచ్ నుంచి 2021-21 బ్యాచ్ బ్యాక్‌లాగ్ అభ్యర్థులకు ఒకసారి ప్రత్యేక అవకాశం కల్పించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూడవచ్చని తెలిపారు. లేదా ఆయా కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

నేడు గోదావరి వద్ద విశేష పూజలు

ధర్మపురి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి గోదావరి నది వద్ద గురువారం సాయంత్రం ఐదు గంటలకు ఆలయం పక్షాన వేదపండితులు, అర్చకులు విశేష పూజలు నిర్వహిస్తారని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరి నదిలో మునిగితే పాపాలన్ని పోతాయని, ఈ నది అందరినీ పవిత్రులుగా చేస్తుందని తెలిపారు. ధర్మపురి క్షేత్రంలో గోదావరి నదికి నవరాత్రులు జరపడం సంప్రదాయంగా కొనసాగుతున్నట్లు వివరించారు. దశమి రోజు నదికి తొమ్మిది రోజులు నవరాత్రులు జరపడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

అనుమతి లేకుండా నిర్మించిన ఇల్లు కూల్చివేత



ఇంటిని కూల్చి వేస్తున్న అధికారులు

మానకొండూర్, జూన్ 4: మానకొండూర్ గ్రామపంచాయతీ పరిధిలో బొల్లం అరుణ అనే మహిళ టీజీబీపాస్ అనుమతి లేకుండా నిర్మించిన ఇంటిని బుధవారం పంచాయతీ కార్యదర్శి రేవంత్‌రెడ్డి ఎక్స్‌కా వేటర్‌తో కూల్చివేయించారు. అక్రమంగా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాన్ని నిలిపివేయాలని మూడు నోటీసులు జారీచేసినా పట్టించుకోలేదని కార్యదర్శి తెలిపారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి ఎంపీవో కిరణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి పోలీసు బందోబస్తు మధ్య ఎక్స్‌కావేటర్‌తో నేలమట్టం చేశారు. అక్రమ కట్టడాలను నిర్మిస్తున్న వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఎంపీవో హెచ్చరించారు.

కోరుట్లలో వాసవి మాతకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి

కోరుట్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణంలోని వాసవి మాత దేవాలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి ఆధ్వర్యంలో పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహాగణపతి, స్వస్తి పుణ్యవచనం, మహాగౌరి, వేద స్వస్తి, యాగశాల ప్రవేశం, నవగ్రహ పూజ కార్యక్రమాలను జరిపారు. ఈ సందర్భంగా విష్ణు, లలిత శాస్త్ర పారాయణంను నిర్వహించారు. ఆలయంలో వాస్తుపూజ వేదపండితులు పాలెపు జయరాం శర్మ, రామకృష్ణ శర్మ, వినయ్ శర్మ, కపిల్ శర్మ మంత్రోచ్ఛరణ మధ్య సాగింది.

పాముల సయ్యాట



సయ్యాటలాడుతున్న పాములు

సైదాపూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నంపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో పాముల ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. చాలా సమయం రెండు పాములు ఒకదానికొకటి చుట్టుకొని ఆటలాడాయి. ఈ పాములను చూసేందుకు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో గుమిగూడారు. వర్షాకాలం సమీపించడంతో పాములు ఇలా కనిపిస్తాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

చెక్‌పోస్టు వద్ద పకడ్బందీగా విధులు నిర్వహించాలి

- గోవుల అక్రమ రవాణాను అరికట్టాలి
- సిరిసిల్ల ఎస్పీ మహేశ్ బి గీతే



సిరిసిల్లలో చెక్ పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ మహేశ్ బి గితే

తంగళ్లపల్లి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): చెక్‌పోస్టు వద్ద పకడ్బందీగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ మహశ్ బి గితే పోలీసు సిబ్బందిని ఆదేశించారు. బుధవారం తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామం సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఎస్పీ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా గోవుల అక్రమ రవాణా ఆరికట్టాడానికి ప్రత్యేకంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇందుకోసం జిల్లా సరిహద్దుల్లో జిల్లెల్ల, పెద్దమ్మ, మానాల ఎక్స్ రోడ్‌ల వద్ద ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. జిల్లెల్ల చెక్ పోస్టు వద్ద వాహనాలకు సంబంధించి నమోదు చేసిన రికార్డులను పరిశీలించారు. వ్యవసాయానికి సంబంధించిన రైతులకు చెందిన పశువుల రవాణాకు ఇబ్బంది కలగకుండా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

నోటీసులను వెనక్కి తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కూర దేవేందర్

వేములవాడ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలోని ప్రధాన రహదారి విస్తరణ కోసం దుకాణాలు, ఇళ్లు ఖాళీ చేయాలంటూ ఇచ్చిన నోటీసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని జనశక్తి నాయకుడు కూర దేవేందర్ అన్నారు. బుధవారం వేములవాడ పట్టణంలోని ఉప్పుగడ్డ వీధిలో ప్రధాన రహదారి నిర్వాసితుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రధాన రహదారి విస్తరణలో 243 దుకాణాలు, ఇళ్లు తొలగించాల్సి వస్తుందని, దాదాపు 2 వేల మంది ఉపాధి కోల్పోతున్నారని ఉన్నారు. రోడ్ల విస్తరణతో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాదిమంది ఉపాధి కోల్పోతున్న విషయం గుర్తించకుండా, రోడ్ల విస్తరణ కారణంగా ఎవరి ఉపాధికి భంగం కలగడం లేదంటూ అధికారులు ప్రకటించడం సమంజసం కాదన్నారు. రోడ్ల విస్తరణపై మరోసారి సర్వే నిర్వహించి పరిహారం పెంచాలని, పరిహారం ఇవ్వకుండానే ఇళ్లు ఖాళీ చేయాలంటూ నోటీసులు ఇవ్వడం చట్ట విరుద్ధమని అన్నారు. ఈ సమావేశంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, నేరెల్ల తిరుమల్ గౌడ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్‌గా బొడ్డు రాజు



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన బొడ్డు రాజు

కరీంనగర్ లీగల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): టీజీఎస్‌ఆర్‌టీసీ కరీంనగర్ స్టాండింగ్ కౌన్సిల్‌గా న్యాయవాది బొడ్డు రాజును నియమిస్తూ ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్‌కు చెందిన న్యాయవాది బొడ్డు రాజు టీజీఎస్ ఆర్టీసీకి సంబంధించిన కేసులు వాదించేందుకు ఈ పదవిలో సంవత్సరకాలం పాటు కొనసాగనున్నారు. ఈ సందర్భంగా న్యాయవాది బొడ్డు రాజు మాట్లాడుతూ తన మీద నమ్మకంతో తనకు పదవి అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, తన నియామకానికి సహకరించిన టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్, స్టేట్ జాయింట్ కన్వీనర్ భూక్య రజనీష్, కరీంనగర్ లీగల్ సెల్ జిల్లా చైర్మన్ కల్లెపల్లి లక్ష్మయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు. రాజు నియామం పట్ల లీగల్ సెల్ జిల్లా కన్వీనర్లు కొత్తకొండ శంకర్, నవాజ్, లింగంపల్లి శ్రీకాంత్, జేరిపోతుల మహేందర్ హర్షం వ్యక్తం చేశారు.

ట్రాక్టర్ ఢీకొని ఒకరి మృతి

రాయికల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరిపెల్లిలో ట్రాక్టర్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. రామాజీపేట గ్రామానికి చెందిన రాజిరెడ్డితో పాటు గ్రామానికి చెందిన బద్దెనపల్లి గంగరాజం (55) బియ్యం పట్టించడానికి కుమ్మరిపెల్లికి రాగా రాజిరెడ్డి ట్రాక్టర్ వెనక్కి తీయడంతో గంగరాజంకు ట్రాక్టర్ ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జగిత్యాలకు తరలించగా మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు.

వామ్మో... పిడుగులు

- నాలుగేళ్లలో ఐదుగురి మృతి
- వణుకుతున్న రైతులు



పిడుగులు (ఫైల్)

సిరిసిల్ల క్రైం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వామ్మో పిడుగులు.. ఆకాశం మేఘావృతం అయిందంటే పంటచేలల్లో ఉన్న రైతులు వణికిపోతున్నారు. ఉరుములు, మెరుపులతో పడుతున్న వర్షాలకు రైతులు ఆందోళన చెందుతున్నారు. అప్రమత్తత లేకుంటే ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో గత నాలుగేళ్లలో కురిసిన అకాల వర్షాల వల్ల పిడుగుపడి అయిదుగురు వ్యక్తులు మృత్యువాత పడ్డారు. ఇటీవల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయి. ప్రధానంగా ఆకాశంలో నల్లని మబ్బులు, ఉరుములు, మెరుపులు, వేగంగా వీచే గాలులు పిడుగుపాటుకు సంకేతాలిస్తాయి. దీంతో పొలాల్లో, దుక్కుల్లో నాగలి దున్నే రైతులు, గేదెలు కాసే కూలీలు, గొర్లు కాసే కాపర్లు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. వాతావరణ పరిస్థితులను బట్టి ఎత్తైన కొండ ప్రాంతాలు, సెల్‌ఫోన్ టవర్లు, విద్యుత్తు, టెలిఫోన్ స్తంభాలు, పొడవైన తాటి, ఈత, కొబ్బరిచెట్టు, ఇతర చెట్ల కింద ఆశ్రయం పొందే వ్యక్తులు పిడుగుపాటుకు గురయ్యే అవకాశం ఉంది.

ఉరుములు, మెరుపులతో ప్రమాదం

సిరిసిల్ల జిల్లాలో గత నాలుగేళ్లలో పిడుగుపాటుకు ఐదుగురు మృత్యువాతపడ్డారు. 2022లో ఒకరు, 2023లో ఒకరు చొప్పున మృతిచెందగా, 2024లో శాత్రాజుపల్లికి చెందిన కంబళ్ల శ్రీనివాస్(32), తంగళ్లపల్లి మండలం ఇందిరానగర్‌కు చెందిన రుద్రారపు చంద్రయ్య(45) అనే రైతులు మృతి చెందారు. గత నెల 27న ఉరుములు, మెరుపులతో కూడిన కురిసిన భారీ వర్షాల కారణంగా పిడుగుపడి ఇల్లంతకుంట మండలంలోని గొల్లపల్లికి చెందిన దాసరి లక్ష్మన్(26) అనే గొర్లకాపరి అక్కడికక్కడే మృతిచెందాడు. అక్కడే కొంత దూరంలో ఉన్న గొర్లకాపరి రాజు స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

జాగ్రత్తలు పాటించాలి

పిడుగుపాటకు గురికాకుండా ఉండాలంటే జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. వర్షాకాలంలో పిడుగుల నుంచి రక్షణ చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా వాతావరణశాఖ హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనించాలి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తున్న సమయంలో అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు వెళ్లకూడదు. బహిరంగ ప్రదేశాల్లో ఉంటే వెంటనే సురక్షితమైన చోటుకు వెళ్లాలి. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు వీస్తున్న సమయంలో ఇంట్లో విద్యుత్ బంద్ చేయాలి. మొబైల్ ఫోన్, ల్యాండ్‌ఫోన్ ఉపయోగించవద్దు. ఇంటి కిటికీలు, తలుపులు మూసిఉంచాలి. నీటితో సంబంధం ఉన్న పనులు చేయొద్దు. నీరు విద్యుత్తును ప్రసరింపజేస్తుంది. పొలాల్లో ఉండే రైతులు, కాపరులు చెట్లు, ఎత్తయిన ప్రదేశాల వద్ద ఉండవద్దు. జలాశయాలు, నదులు, స్విమ్మింగ్ పూల్స్‌లో ఉంటే వెంటనే బయటకు రావాలి. వాహనాలలో ఉన్నప్పుడు డోర్లు మూసి ఉంచాలి. మెటల్ బాడీ పిడుగును డైవర్ట్ చేస్తుంది. బైక్, సైకిల్‌పై ఉంటే వెంటనే వదిలిపెట్టి దూరంగా జరగాలి. బహిరంగ ప్రదేశాల్లో, గ్రౌండ్‌లలో ఉంటే కిందకూర్చొని రెండు కాళ్లు దగ్గరపెట్టి మధ్యలో తలదాచుకొని కూర్చుంటే పిడుగుపాటు నుంచి బయటపడవచ్చు.

ప్రాథమిక చికిత్స

పిడుగుపాటుకు గురైన వ్యక్తికి వెంటనే ప్రాథమిక చికిత్స చేయాలి. అవసరమైతే సీపీఆర్ చేయాలి. అత్యవసర సేవల కోసం 108కు కాల్‌చేయాలి. చికిత్స కోసం దగ్గరలోని ఆసుపత్రికి తరలించాలి.

రేపు నిర్జల ఏకాదశి

కరీంనగర్ కల్చరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : హిందూ సంప్రదాయంలో ఏకాదశి తిథి ముఖ్యమైంది. నెలకు రెండు సార్లు (కృష్ణపక్షం, శుక్లపక్షం) వచ్చే ఏకాదశి నాడు ఉపవసిస్తూ విష్ణువును పూజిస్తే శుభ ఫలితాలు కలుగుతాయని, పాపాలు పోతాయని నమ్మకం. పాశ్చాత్య వైద్యులు, శాస్త్రవేత్తలు కూడా వారంలో ఒక రోజు ఉపవాసం పాటించడం వల్ల శరీరం అన్ని విధాల సహకరిస్తుందని, జీవ క్రియలు మెరుగు పడుతాయని పేర్కొంటున్నారు. నిర్జల ఏకాదశి 24 ఏకాదశుల్లో పవిత్రమైంది. ఇది జ్యేష్ఠ మాసంలో శుక్లపక్ష ఏకాదశినాడు వస్తుంది. దీన్నే భీమ ఏకాదశిగా చెబుతారు. ఈ రోజున అత్యంత కఠినంగా నీరు కూడా తీసుకోకుండా ఉపవాసం పాటిస్తుండటంతో దీనికి ఆ పేరు వచ్చింది. ఇది కేవలం ఆధ్యాత్మిక ఆచారమే కాదు. భక్తులు తమ కర్మలను శుద్ధి చేసుకోవడానికి, సామర్థ్యాన్ని, సమృద్ధిని ఆహ్వానించడానికి ఒక ప్రత్యేక అవకాశం. నిర్జల ఏకాదశినాడు ఉపవాసం చేస్తే విష్ణువు అనుగ్రహంతో పాటు ఆనందం, శ్రేయస్సు, సుఖం, సంపద, శాంతి కలుగుతాయని అందరూ విశ్వసిస్తారు. మిగతా అన్ని ఏకాదశులు చేసినట్లేనని నమ్ముతారు. ఏకాదశి నాడు సూర్యోదయం నుంచి మరుసటి రోజు సూర్యోదయం వరకు 24 గంటలు ఉపవాసం ఉండాలి. అయితే పిల్లలు, వ్యాధిగ్రస్తులు, అనారోగ్యంతో ఉన్న వారు, వృద్ధుల విషయంలో మినహాయింపు ఉంది. వారు నీరు లేదా ఒక పూట అల్పాహారం, పండ్లు గానీ తీసుకోవచ్చు.

● నిర్జల ఏకాదశి నాడు చేయాల్సినవి

ఎండల నుంచి ఉపశమనం కలిగించే వస్తువులను దానం చేయాలి. కుండలు, మజ్జిగ, నీరు, పుచ్చకాయ, దోసకాయ, గొడుగులు, బెల్లం, గోశాలలకు, ఆవులకు పచ్చగడ్డి, బట్టలు, ధాన్యాలు, కూరగాయలు, పండ్లు, పంచదార, వస్త్రాలు (ముఖ్యంగా పసుపు వర్ణం) దానం చేయాలని శాస్త్రాలు చెబుతున్నాయి. ఆలయాలు, ట్రస్టులు, ధార్మిక సంస్థలు, అవసరార్థులకు డబ్బును శక్తి కొలది దానం చేయాలి. ఇంటి ప్రధాన ద్వారం వద్ద దీపాన్ని వెలిగించాలి.

● ఏ రోజున నిర్జల ఏకాదశి

ఈ ఏకాదశి తిథి రెండు రోజులు రావడంతో ఏ తేదీన పాటించాలనే సందేహం కలుగుతుంది. పంచాంగం ప్రకారం ఏకాదశి ఈ నెల 5వ తేదీన అర్ధరాత్రి 2-15 గంటలకు మొదలవుతుంది. 7న ఉదయం 7-47 గంటల వరకు కొన్ని పంచాంగాలలో 4-47 గంటల వరకే ఉంటుంది. ఈ నేపథ్యంలో 6న సూర్యోదయ వ్యాప్తికి ఏకాదశితిథి ఉండటంతో 6న పాటించాలని పండితులు చెబుతున్నారు. కొందరు 7న కూడా పాటించే అవకాశాలున్నాయి.

పూచీకత్తుగా ఉంటే మోసం చేశాడు

- బాధితులు ఆందోళన

కరీంనగర్ క్రైం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): చిట్‌ఫండ్స్‌లో చిట్ డబ్బులు తీసుకునేందుకు పూచీకత్తు ఉన్న ప్రభుత్వ ఉద్యోగులను చిట్ ఎత్తుకున్న వ్యక్తి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని బాధితులు ఆ వ్యక్తి పనిచేస్తున్న చిట్‌ఫండ్ వద్ద బుధవారం ఆందోళనకు దిగారు. రవికుమార్ అనే వ్యక్తి గతంలో ఒక చిట్‌ఫండ్స్‌లో చిట్టివేసి దానిని ఎత్తుకుని డబ్బులు తీసుకునేందుకు గసికంటి మహేందర్, ఇరుగురాల నర్సయ్య అనే ప్రభుత్వ ఉద్యోగులతో పూచికత్తు పెట్టించుకున్నాడు. అనంతరం తాను వేసిన చిట్టీ డబ్బులు తీసుకున్నాడు. చిట్టీ ఎత్తుకుని నెలనెలా వాయిదా డబ్బులు చెల్లించక పోవడంతో పూచికత్తు పెట్టిన వారికి ఆ చిట్‌ఫండ్స్ కోర్టు ద్వారా నోటీసులు పంపించింది. ఈ సందర్భంలో కోర్టు వద్ద మరొక చిట్‌ఫండ్స్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న రవికుమార్‌ను కలిసేందుకు వచ్చిన బాధితులు అతన్ని నిలదీసి, నిరసన వ్యక్తం చేస్తూ ఆసిడ్ బాటిల్ పట్టుకొని ఆత్మహత్యాయత్నం చేశారు.

ఈ ఘటనపై సమాచారం అందుకున్న మూడో టౌన్ పోలీసులు అక్కడకు చేరుకొని బాధితులను, రవికుమార్‌ను అక్కడి నుంచి పంపించివేశారు.

గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో నీటి తిప్పలు



బోరుబావికి తొలగించిన మోటార్



నీరు లేక ఇబ్బందిపడుతున్న డయాలసిస్ బాధితులు

కళ్యాణ్‌నగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నీరు లేక ఇబ్బందిగా మారింది. రెండు రోజులుగా ఆసుపత్రికి నీటిని సరఫరా చేసే మోటార్ కాలిపోవడంతో ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చేవారితో పాటు, డయాలసిస్ రోగులకు సరైన నీరు అందక మధ్యలోనే యంత్రాలు మొరాయిస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రిలో రోజు నాలుగు షిఫ్టుల్లో డయాలసిస్ నిర్వహిస్తున్నారు. రెండు రోజులుగా మోటార్ కాలిపోవడంతో డయాలసిస్ రోగులకు రక్తం శుద్ధి చేయడానికి సరైన నీరు లేకపోవడంతో అవస్థ పడుతున్నారు. దినదినం గండంగా గడిపే డయాలసిస్ రోగులకు డయాలసిస్ చేస్తేనే వారి జీవనం సాగుతోంది. రెండు రోజులుగా డయాలసిస్ కోసం వచ్చే రోగులను సిబ్బందికి ఇంటికి పంపించారు. మోటార్ కాలిపోవడంతో బయట వాటర్ ప్లాంట్ల నుంచి నీటిని కొనుగోలు చేసి కొంత మందికి డయాలసిస్ నిర్వహిస్తున్నారు. ఆసుపత్రి ఆవరణలో ఉన్న బోరు తరచూ కాలిపోతుండడంతో నీటి సమస్య ఏర్పడుతోంది. మరో బోరును ఏర్పాటు చేసి సరిపోయే నీటిని అందించాలని రోగులు కోరుతున్నారు.

మరమ్మతు చేయిస్తున్నాం : ఆర్ఎంవో రాజు

ఆసుపత్రి ఆవరణలో ఉన్న మోటార్ కాలిపోయింది. ప్రత్యామ్నాయంగా చర్యలు చేపడుతున్నాం. త్వరితగతిన మోటార్ రిపేరు చేయిస్తున్నాం.

విత్తన స్వయం సమృద్ధే లక్ష్యంగా..

(5వ పేజీ తరువాయి)

ఇలా ఒకరి నుంచి మరొకరికి ఈ విత్తనాలను రొటేషన్ చేయడం వల్ల రెండు, మూడేళ్లలో మొత్తం విస్తరించ నున్నాయని, తమ భూమిలో తామే స్వయంగా పండించిన విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకునే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

- దోమ ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి

'నాణ్యమైన విత్తనం- రైతన్నకు నేస్తం' విత్తుకొద్ది పంట కార్యక్రమం ద్వారా వ్యవసాయ పరిశోధనా స్థానాల్లో రూపొందించిన మేలైన విత్తనాలను ప్రభుత్వం పంపిణీ చేసింది. ఈ విత్తనాలను ఆదర్శ రైతులు సద్వినియోగం చేసుకోవాలి. తద్వారా వచ్చే పంటను ఇతర రైతులకు తక్కువ ధరకే విక్రయించాలి. దీంతో ప్రతీ గ్రామంలో రైతుకు నకిలీ విత్తనాల బెడద తప్ప నున్నది. రైతులు ఆ విత్తనాలతోనే సాగు చేయడం వల్ల రైతుల చెంతనే నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంటాయనే ఉద్ధేశ్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలి

పెద్దపల్లి రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలని మహిళ సాధికారత కేంద్రం బృందం జెండర్ స్పెషలిస్ట్ సుచరిత, ఫైనాన్షియల్ లిట్రసి సంధ్య అన్నారు. బుధవారం అందుగులపల్లిలో గ్రామీణ ఉపాధిహామీ పనుల వద్ద అవగాహన కల్పించారు. బాలికల రక్షణ, విద్య, లింగ నిర్ధారణను నివారించేందుకు బేటీ బచావో బేటీ పడావో పథకాన్ని కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. చట్టాలు, టోల్‌ఫ్రీ, అంశాలపై వివరించారు. కార్యదర్శి గీతవాణి, ఫీల్డ్ అసిస్టెంట్ సతీష్ పాల్గొన్నారు.

డివిజన్ల పునర్విభజనలో లోపించిన పారదర్శకత

జాబితాలో చోటుచేసుకోని బ్లాకులు ● క్షేత్ర స్థాయిలో 1300ఓట్లు, జాబితాలో 3,300ఓట్లు

కోల్‌సిటీ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థలో డివిజన్ల పునర్విభజన పారదర్శకత లేకుండా జరిగింది. పునర్విభజన ప్రక్రియకు ప్రభుత్వం రెండు రోజులు గడువు మాత్రమే ఇవ్వడంతో కార్పొరేషన్ యంత్రాంగం ఓటర్ల జాబితా ఆధారంగా పునర్విభజన జరిగింది. కొత్తగా విధుల్లో చేరిన వార్డు ఆఫీసర్లకు క్షేత్రస్థాయిలో బ్లాక్‌లపై అవగాహన లేకపోవడంతో తప్పులు దొర్లాయి. బుధవారం ప్రకటించిన ముసాయిదాలో చాలా వరకు డివిజన్లలో క్షేత్రస్థాయి ఓట్ల సంఖ్యకు, ప్రకటించిన ఓట్లకు సంఖ్యకు సంబంధం లేని పరిస్థితి నెలకొన్నది. లింగాపూర్, కుందనపల్లి, అక్బర్‌నగర్, వెంకట్రావ్‌పల్లి, ఎల్కలపల్లి గేట్ గ్రామాలను విలీనం చేయగా డివిజన్ల సంఖ్య 60కి పెరిగింది. రామగుండంలో డివిజన్లు 4 నుంచి 6, యైటింక్లయిన్‌కాలనీలో 5 నుంచి 7కు పెరిగాయి. కుందనపల్లి, అక్బర్‌నగర్, రైల్వే స్టేషన్ ఏరియా, ఎస్‌టీ కాలనీని ఒక డివిజన్‌గా మార్చారు. లింగాపూర్ గ్రామానికి విలేజి రామగుండంలోని కొంత ప్రాంతాన్ని కలిపారు. విలేజి రామగుండంలోని మరికొంత భాగాన్ని హౌసింగ్ బోర్డు, పాత బజార్‌కు సంబంధించిన డివిజన్‌లో కలిపారు. యైటింక్లయిన్‌కాలనీలో వీర్లపల్లిని, మారేడుపాకను కలిపి ఒక డివిజన్‌గా మార్చారు. వెంకట్రావ్‌పల్లిని రెండు డివిజన్లలో కలిపారు. 20వ డివిజన్‌లో వెంకట్రావ్‌పల్లికి సంబంధించిన ఇండ్లను సింగరేణి క్వార్టర్ల పేర 3,649 ఓటర్లుగా చూపారు. ఆ బ్లాక్‌ల్లో కేవలం 1800ఓట్లు మాత్రమే ఉన్నాయి. 23వ డివిజన్‌లో అల్లూరులో షిర్కే బస్టాండ్ ప్రాంత క్వార్టర్లను కలిపారు. గోదావరిఖని పట్టణంలోని పరుశరాంనగర్‌లో 42వ డివిజన్‌గా 3,301ఓట్లుగా చూపారు. ఆ డివిజన్‌లో 1300లకు మించి ఓట్లు లేవు. అలాగే 41వ డివిజన్‌లో 500ఇండ్ల జాబితాను మరిచారు. పాత 25, 26డివిజన్లను మూడు డివిజన్లుగా విభజించారు. ఇందులో 32వ డివిజన్‌లో శారదానగర్, చంద్రబాబుకాలనీలోని కొంత భాగానికి శాంతినగర్‌లోని ఇండ్లను కలిపారు. కొన్ని డివిజన్లు, సింగరేణి క్వార్టర్లు ఉన్న ప్రాంతాలు మాత్రం పునర్విభజనలో స్పష్టత కనబడింది. అదే విధంగా చంద్రశేఖర్‌నగర్ ఉన్న 47వ డివిజన్‌కు అదనంగా రాజీవ్‌నగర్‌ను కలిపారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వామపక్షాల నాయకులు

కళ్యాణ్‌నగర్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని, కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించాలని వామపక్ష పార్టీల నాయకులు తాండ్ర సదానందం, యాకయ్య, నరేష్, ఐ కృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం భాస్కర్‌రావు భవన్‌లో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి నరేష్ అధ్యక్షతన జిల్లా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం నరమేధాన్ని కొనసాగిస్తుందని, ఛత్తీస్‌గడ్‌లో మావోయిస్టు పార్టీ కార్యకర్తలు, ఆదివాసీలను, గిరిజనులను 500 మందిని హత్య చేశారని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకత్వంలో మోదీ ప్రభుత్వం దేశంలో ఉన్న చట్టాలను, నిబంధనలను ఉల్లంఘిస్తుందన్నారు. మావోయిస్టు నాయకులను భౌతికంగా నిర్మూలించే కార్యక్రమాన్ని చేపట్టిందని, ఆదివాసీలను, గిరిజనులను పట్టించుకోకుండా, నిరంకుశంగా వ్యవహరిస్తుందన్నారు. 2026కల్లా మావోయిస్టు రహిత దేశంగా మారుస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటించి నరమేధాన్ని కొనసాగిస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం సాగిస్తున్న ఈ దుశ్చర్యలను ఖండిస్తున్నట్టు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరిపి కాల్పుల విరమణ చేయాలని డిమాండ్ చేశారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈ నెల 14న హైదరాబాద్‌లో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు జూపాక శ్రీనివాస్, లచ్చయ్య, మహేశ్వరి, గౌతం గోవర్దన్, తోకల రమేష్, రాంచందర్, రాజేశం, కనకరాజు, దుర్గయ్య, చంద్రయ్య, చంద్రశేఖర్, రవికుమార్ పాల్గొన్నారు.

గ్రామీణ యువతకు మెరుగైన ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ సుబ్బారావు

మంథని, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఉద్యోగ శిక్షణ, ఉపాధి కల్పన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు యంగ్ ఇండి స్కిల్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ వీఎల్‌వీఎస్ఎస్ సుబ్బారావు, రిజిష్టర్ ప్రొఫెసర్ డాక్టర్ జొన్నలగడ్డ సుధాకర్‌లు వెల్లడించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన ఉద్యోగ శిక్షణ, ఉపాధి కల్పనలో మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత యువతకు ప్రాధాన్యం ఇవ్వాలనే ఉద్దేశ్యంతోనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జయకిషన్‌ఓఝా పాల్గొన్నారు.

పేదలకు ఉచిత న్యాయ సహాయం



మాట్లాడుతున్న జడ్జి భవాని

మంథనిరూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో పేదలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నట్లు మంథని సీనియర్ సివిల్ జడ్జి భవాని వెల్లడించారు. మండలంలోని గుంజపడుగు గ్రామంలో బుధవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. ఈనెల 14న నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో రాజీ అవకాశం ఉన్న కేసులను ఇరువర్గాల మధ్య అవగాహన పరిష్కరించుకునే అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. పేదల ప్రజలు న్యాయ సహాయం కోసం కోర్టులకు రావచ్చని తెలిపారు. పౌరుల హక్కులు, బాధ్యతలు, చట్టాల పట్ల బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి రఘోత్తంరెడ్డి అవగాహన కల్పించారు. భూభారతి, భూ చట్టపరమైన అంశాలను తహసీల్దార్ కుమారస్వామి వివరించారు. రైతులకు సంబంధించిన చట్టపరమైన అంశాల పై న్యాయవాదులు శశిభూషన్‌కాచే, కట్కం శ్రీనివాస్‌లు మాట్లాడారు. ఈకార్యక్రమంలో పీఏపీఎస్ కొత్త శ్రీనివాస్, ఎస్ఐ రమేష్, లోక్ అదాలత్ సభ్యులు కనుకుంట్ల స్వామి, రైతులు పాల్గొన్నారు.

టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్థులు



పొత్కపల్లిలో మట్టి టిప్పర్లను అడ్డుకుంటున్న గ్రామస్థులు

ఓదెల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్కపల్లిలో బుధవారం గ్రామస్థులు, వ్యాపారులు మట్టి టిప్పర్లను అడ్డుకున్నారు. అధికలోడ్‌తో వెళుతున్న మట్టి లారీల వల్ల దుమ్ముధూళి అధికంగా లేచి ఇళ్లల్లోకి, దుకాణాల్లోకి వస్తుందని, రోడ్డులో నీటి క్యూరింగ్ చేయడం లేదని వ్యాపారస్తులు తెలిపారు. లారీలను అడ్డుకోవడంతో వాహనాలన్నీ భారీగా నిలిచిపోయాయి. పోలీసులు చేరుకొని మట్టి కాంట్రాక్టర్లతో మాట్లాడి నీటి క్యూరింగ్‌తోపాటు గ్రామస్థులకు ఇబ్బంది లేకుండా చూస్తామని తెలపడంతో ఆందోళనను విరమించారు.

కాల్వశ్రీరాంపూర్: పందిళ్ల గ్రామ ఊర చెరువు నుంచి వారం రోజులుగా పెద్దపల్లి లోని ఇటుక బట్టీలకు మట్టిని తరలిస్తున్నారు. మట్టి తరలింపు కారణంగా అధికలోడుతో రహదారి చెడిపోవడంతో పాటు దుమ్ముధూళి దుకాణాలలోకి వస్తోందని వాపోయారు. బుధవారం మండల కేంద్రంలో గ్రామస్తులు మట్టిలోడుతో వెళ్తున్న లారీలను అడ్డుకున్నారు. పోలీసులు గ్రామస్తులతో మాట్లాడారు. పెగడపల్లి గ్రామానికి చెందిన పత్తి రాజేందర్‌రెడ్డి రోడ్డు పక్కన నిలుచొని ఉండగా మట్టి లారీ తగలడంతో స్వల్పగాయాలయ్యాయి. లారీ ఆపకుండా డ్రైవర్ పోతుండడంతో గ్రామస్తులు వెంబడించి లారీ డ్రైవర్‌ను కాల్వశ్రీరాంపూర్‌లో పట్టుకున్నారు.

ఉపాధిహామీ సామాజిక తనిఖీ

రామగిరి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): పన్నూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం 4వ విడత సామాజిక తనిఖీ సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీవో అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా డీఆర్‌డీవో కాళిందినీ హాజరయ్యారు. 209 పనుల్లో రూ.2,75,06,746 ఖర్చుకాగా వేతనాలు 2,68,59,655 అందించినట్లు వెల్లడించారు. అందులో మెటీరియల్ 6,47,091 ఖర్చులుగా తెలిపారు. పంచాయతీరాజ్ నిర్వహించిన 74 పనుల్లో వేతనాలు 8748, మెటీరియల్ రూ. 3,87,61,019లుగా వెల్లడించారు. ఏపీడీ సత్యనారాయణ, ఎంపీవో ఉమేష్, ఏవీవో కొమురయ్య, అంబుడ్స్‌పర్సన్ తిమ్మరాజు శరత్‌కుమార్, ఈసీ మౌనిక, పాల్గొన్నారు.

ఏడాదిలోనే తనదైన ముద్ర వేసుకున్న ఎంపీ వంశీకృష్ణ

పెద్దపల్లిటౌన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి) ఏడాదిలోనే ఎంపీగా గడ్డం వంశీకృష్ణ తనదైన ముద్ర వేసుకొన్నారని పలువురు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు వును కొండ శ్రీధర్ పటేల్ ఆధ్వర్యంలో బుధవారం వంశీకృష్ణ ఎంపీగా గెలిచి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా కేకులు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఎంపీగా గెలిచిన వెంటనే ప్రజలతో సన్నిహితంగా ఉంటూ అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొంటున్నాడ న్నారు. కరోనా టైం లో నిలిచిపోయిన ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లను మంచిర్యాల, పెద్దపల్లి, రామగుండం, ఓదెల స్టేషన్లలో నిలిచేలా కృషి చేశారు. పార్లమెంటులో సింగరేణి కార్మికుల సమస్యపై మాట్లాడారన్నారు. . సింగరేణి రిటైర్డ్ కార్మికుల పింఛన్ పదివేలకు పెంచేలా సింగరేణి యాజమాన్యంపై ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. సయ్యద్ సజ్జద్, భూమయ్య, శ్రీనివాస్,రాజేశం, ఫయాజ్, రవి, రాజేష్, పాల్గొన్నారు.



బాణాసంచా కాలుస్తున్న కాంగ్రెస్ నాయకులు

గోదావరిఖని, (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పార్లమెంట్ అభివృద్ధికి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కృషి చేస్తున్నారని, ఎంపీగా పదవీకాలం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవా రం చౌరస్తాలో కాంగ్రెస్ నాయకుడు కామ విజయ్ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్లికార్జున్ మాట్లాడు తూ ఏడాది కాలంలో ఎంపీ వంశీకృష్ణ అనేక సమస్యలపై పార్లమెంట్‌లో గళం విప్పా డన్నారు. సీఎంపీఎఫ్ ట్రస్ట్ బోర్డుకు టన్ను బొగ్గుపై అదనంగా రూ.10 జమ చేయాలని పార్లమెంట్‌లో మాట్లాడారని, దీనికి సింగరేణి యాజమాన్యం ఆదేశాలు జారీ చేశారని, కార్మికులకు ఆదాయ పన్ను మినహాయింపు చేయాలని కోరారు. రాచకొండ కోటేశ్వర్లు, మల్లేష్, హకీం, నరేందర్‌రెడ్డి, శ్రీకాంత్, నగేష్, రాజు, చారి, మహేష్, పాల్గొన్నారు.

నైనీ ప్రాజెక్టు అధికారిగా మాధవరావు



యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఒడిశా రాష్ట్రంలో చేపట్టనున్న నైనీ బొగ్గు బ్లాక్ ప్రాజెక్టు అధికారిగా బింగి మాధవరావు నియమితులయ్యారు. ప్రస్తుతం రెస్క్యూ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మాధవరావును నైనీ ప్రాజెక్టు అధికారిగా యాజమాన్యం బదిలీ చేసింది. 11 ఏళ్ళు అండర్ గ్రౌండ్, 6 సంవత్సరాలు ఓపెన్‌కాస్ట్ మైనింగ్‌లో పనిచేశారు. రెస్క్యూ సూపరింటెండెంట్‌గా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సింగరేణి పేరు నిలిచే లా మాధవరావు కృషి చేశారు. బదిలీపై వెళ్తున్న మాధవరావుని ఆర్జీ-2 అఫీషియేటింగ్ జీఎం రాముడు ఏరియా అధికారులతో కలసి సన్మానించారు.



ఏరియా సేఫ్టీ ఆఫీసర్‌గా భానుప్రసాద్



రామగిరి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ ఏరియా సేఫ్టీ ఆఫీసర్‌గా భానుప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జీఎం నాగేశ్వర్‌రావుకు చేతుల మీదుగా జాయినింగ్ రిపోర్ట్ స్వీకరించారు.

ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో ఎస్‌టీ లైజన్ ఆఫీసర్ తనిఖీ



తనిఖీ చేస్తున్న లైజన్ ఆఫీసర్, బృందం

గోదావరిఖని, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో బుధవారం సింగరేణి ఎస్‌టీ లైజన్ ఆఫీసర్ వీసం కృష్ణయ్య, బృందం సభ్యులు తనిఖీ నిర్వహించారు. ప్రమోషన్లలో ఎస్‌టీ రిజర్వేషన్లు పాటిస్తున్నరా అనే విషయంపై రోస్టర్ రిజిస్టర్స్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీ అసోసియేషన్ ప్రతినిధులు డీ పంతులు, ఎ. భాస్కర్‌రావు, బుక్య నాగేశ్వరరావు, ఆర్జీ-1 ఏరియా అధికారులు ఏ ఆంజనేయులు, కిరణ్ బాబు, ఆర్జీ-1 ఎస్‌టీ లైజన్ ఆఫీసర్ కారం పద్మ, జయపాల్ జాదవ్, బీ శ్రీనివాస్ నాయక్, సీనియర్ పర్సనల్ అధికారులు శ్రావణ్ కుమార్, హన్మంతరావు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

పాలకుర్తి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం భూ భారతి రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జేరుపోతుల సునీత అన్నారు. ఎల్కలపల్లి, పుట్నూర్ గ్రామాల్లో బుధవారం సదస్సుల్లో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ భూ సమస్యలపై రైతులు పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకుంటున్నారని, వాటిని త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

కోల్‌సిటీ: భూ భారతి ద్వారా రైతుల సమస్యలను పరిష్కారమవుతాయని తహసీల్దార్ సునీత అన్నారు. గుంటూరుపల్లిలో నిర్వహించిన రైతు సదస్సులో మాట్లాడుతూ రైతులు సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

జ్యోతినగర్: మల్కాపూర్‌లో రెవెన్యూ సదస్సులో ఆర్‌డీవో గంగయ్య హాజరయ్యారు. రైతులు భూ సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. ఆర్‌డీవో మాట్లాడుతూ రైతుల వద్దకే వచ్చి భూముల సమస్యల దరఖాస్తులు తీసుకునేందుకే గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. గతంలో మీ సేవలో రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకునే వారన్నారు. రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను రెవెన్యూ అధికారులే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని తెలిపారు. తహసీల్దార్ దత్తుప్రసాద్, కోటేశ్వర్‌రావు, అధికారులు ఇంతియాజ్, రాజేందర్, సంపత్ కుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్: గౌరెడ్డిపేట, అప్పన్నపేట, నిట్టూరు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ రాజయ్య, డిప్యూటీ తహసీల్దార్ విజేందర్, ఆర్ఐలు భాను, వెంకట రాజిరెడ్డి పాల్గొన్నారు.

రామగిరి: కల్వచర్ల జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో భూభారతి రెవెన్యూ సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ వేణు హాజరయ్యారు. గ్రామంలోని వివిధ భూ సమస్యలపై 14 దరఖాస్తులను స్వీకరించారు. ఆర్డీవో సురేష్, తహసీల్దార్ సుమన్, డిటి మానస, పాల్గొన్నారు.

సుల్తానాబాద్: గట్టెపల్లి, కాట్నపల్లి గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసిల్దార్ బషీరొద్దిన్ దరఖాస్తులను స్వీకరించారు. కాట్నపల్లిలో 13, గట్టేపల్లిలో 29 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. డిప్యూటీ తహసిల్దార్ రాకేష్, ఆర్ఐలు వినోద్, సమ్మయ్యలు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంతో పాటు గంగారం గ్రామపంచాయతీ కార్యాలయంలో తహసీల్దార్ జగదీశ్వర్‌రావు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల వద్ద దరఖాస్తులు తీసుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ గర్రెపల్లి శంకర్, సీనియర్ అసిస్టెంట్ అజీమ్, ఆర్ఐలు నిహారిక, ఆలీ పాల్గొన్నారు.

మంథనిరూరల్: గుంజపడుగు, నగరంపల్లి, ఎక్లాస్‌పూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, తహసీల్దార్ కుమారస్వామి దరఖాస్తులను స్వీకరించారు. గుంజడుగులో పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, డీటీ గిరి, రాంబాబు, ఆర్ఐలు సదయ్య, అనీల్ పాల్గొన్నారు.

ఖరీఫ్ పంటలపై రైతులకు అవగాహన

కాల్వశ్రీరాంపూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గంగారం, పెగడపల్లి, ఊషన్నపల్లి గ్రామాలలో కృషివిజ్ఞాన కేంద్ర, రామగిరిఖిల్లా శాస్త్రవేత్తలు వికసిత కృషిసంకల్ప అభియాన్‌లో భాగంగా బుధవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. శాస్త్రవేత్త డాక్టర్ బి.భాస్కర్‌రావు మాట్లాడుతూ రైతులకు అధిక ఆదాయాన్ని ఇచ్చే పంటలైన కూరగాయలు, పూల సాగు చేయాలని సూచించారు. సుస్థిర ఆదాయంకోసం రైతులు సమగ్రపంట ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. అనంతరం డైరెక్టర్ ఆఫ్ పౌల్ట్రీ రీసెర్చ్ ఇన్సిట్యూట్, హైదరాబాద్ శాస్త్రవేత్త డాక్టర్ నిరంజన్ మాట్లాడుతూ వ్యవసాయంతో పాటు పశువులు, కోళ్లు, గొర్రెలు, మేకలను కూడా పెంచాలని వివరించారు. మండల వ్యవసాయ అధికారి నాగార్జున, ఉద్యానవన ఆఫీసర్ మహేష్, పట్టు పరిశ్రమ అధికారి తిరుపతిరెడ్డి, ఏఈవో సతీష్, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ఎలిగేడు, జూన్ 4: ఎలిగేడు రెవెన్యూ గ్రామపరి ధిలోని లలితపల్లిలో ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి ఉన్న రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పేర్లను నమోదుతో పాటు మట్టి నమూనాలను తేవాలని మండల వ్యవ సాయశాఖ అధికారి ఉమాపతి తెలిపారు. జాతీయ సహజ వ్యవసాయ మిషన్ (ఎన్ఎఫ్ఎన్ఎం)లో భాగంగా ఒక్కో రైతు ప్రకృతి వ్యవసాయంపై మక్కువ ఉంటే రైతు వేదికలో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈవో సురేష్ రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు స్పందన కరువు

ముత్తారం, జూన్ 4: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులకు స్పందన లేకుండా పోయింది. బుధవారం నిర్వహించిన సదస్సుకు మధ్యాహ్నం వరకు ఎవరూ రాకపోవడంతో అధికారులు ఖాళీగా కూర్చున్నారు. ధరణిలో మార్పులు చేర్పులకు వీలులేకపోవడంతో ఎమ్మార్వో కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకుండాపోయింది. దీంతో సమస్యలపై దరఖాస్తు చేసేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ఇప్పటికైనా భూ భారతి రెవెన్యూ సదస్సుల పై ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రకృతి సేద్యంపై రైతులకు అవగాహన



మచ్చుపేటలో రైతులకు వివరిస్తున్న అధికారులు

ముత్తారం, జూన్ 4: (ఆంధ్రజ్యోతి): జాతీయ సహజ వ్యవసాయ మిషన్‌లో భాగంగా ముత్తారం మండలం మచ్చుపేట రెవెన్యూ గ్రామంలో రైతులకు ప్రకృతి సేద్యంపై అవగాహన కల్పించారు. ఆసక్తి ఉన్న రైతులు తమ పేర్లను నమోదు చేసుకుని మట్టి నమూనాలను తీసుకురావాలని అధికారులు సూచించారు. మట్టి నమూనాలను సేకరించే విధానాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. మండలవ్యవసాయ అధికారి అనూష, విస్తరణ అధికారి హారిక పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ

ముత్తారం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు చెలుకల జితేందర్ యాదవ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా డీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ సదానందం బుధవారం పరామర్శించారు. కరీంనగర్‌లో ఓ ప్రైవేట్ ఆసుత్రిలో చికిత్స పొందుతున్న జితేందర్‌ను కలిసి వివరాలను తెలుసుకొన్నారు.

ముగిసిన పెద్దమ్మ తల్లి ఆరాధనోత్సవాలు



వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లి ఆరాదనోత్సవాలు పొత్కపల్లిలో బుధవారం ముగిశాయి. గత నెల 31న ప్రారంభమైన వేడుకలు ఐదు రోజుల పాటు కొనసాగాయి. చివరిరోజున ఇంటికొక బోనంతో వందలాది మంది మహిళలు బోనాలనెత్తుకొని పెద్దమ్మ తల్లికి బోనాలతో పాటు ఘటం కుండాలను సమర్పించారు. ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు పెద్దమ్మ తల్లిని దర్శించుకుని మొక్కులను సమర్పించారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పిట్టల అంజయ్య, బండారి రాము, చొప్పరి సంపత్, అక్కల సుధాకర్, పల్లె కుమార్, పిట్టల సత్యనారాయణ, చిలువేరి రాజేందర్, పిట్టల సదానందం తో పాటు తదితరులు కుల పెద్దలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అధునాతన విద్య



ఓదెలకు చేరిన యుటీఎఫ్ బడిబాట ప్రచారజాతా

ఓదెల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని హంగులతో అధునాతనంగా విద్యావకాశాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు కార్పొరేట్ వలలో చిక్కి ఆర్థిక నష్టాలకు గురికావద్దని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కాంపల్లి లక్ష్మణ్ అన్నారు. బుధవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న బడిబాట ప్రచార జాత ఓదెలకు చేరింది. దీంతో ఎంపీడీవో తిరుపతి జెండా ఊపి ప్రచార రథాన్ని స్వాగతించారు. లక్ష్మణ్ మాట్లాడుతూ, ప్రస్తుతం పాఠశాలలోని విద్యలో డిజిటల్ ఉపకరణాలతో బోధనకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యను అందించే విధంగా ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్లు పేర్కొన్నారు. నాణ్యమైన విద్యను అందించే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవాలని కోరారు. శ్రీవిష్ణు, ప్రణయ్, వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్, కెవిపిఎస్ కార్యదర్శి అశోక్, శ్రావణ్ పాల్గొన్నారు.

మహిళ ప్రాణాలను కాపాడిన సింగరేణి వైద్యులు

గోదావరిఖని, జూన్ 4(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో ఓ బాలింతకు అరుదైన శస్త్ర చికిత్స చేసి ఆమె ప్రాణాలను కాపాడారు. ఆర్జీ-2 పరిధిలోని ఓసీపీ-2లో పని చేసే ఓ ఉద్యోగి సతీమణి రెండో కాన్పు కోసం సింగరేణి ఏరియా ఆసుపత్రిలో చేరింది. ఆమె బుధవారం మగ బిడ్డకు జన్మనివ్వగా ప్రసవం సమయంలో గర్భసంచి ఇబ్బందులతో ప్రాణాపాయ స్థితికి చేరుకోగా వెంటనే గైనకాలజిస్ట్ ఇందిర శస్త్ర చికిత్స చేసి బాలింతను కాపాడారు. వైద్యురాలిని సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ రాజ్, ఏసీఎంఓఏ అంబిక అభినందించారు.

పశువులను గోశాలకు తరలించండి

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కళ్యాణ్‌నగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రహదారులపై పశువుల సంచారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి రామగుండం కార్పొరేషన్ కమిషనర్ స్పందించారు. ప్రధాన రహదారులపై, నగరంలో విచ్చల విడిగా పశువులు తిరుగుతుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, పశువుల యజమానులు వాటిని తీసుకెళ్లాలని, లేకపోతే గోశాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు కమిషనర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో సింగరేణి ఉద్యోగి మృతి



గాదం సాగర్(ఫైల్)

కోల్‌సిటీ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని గంగానగర్‌కు చెందిన గాదం సాగర్(30) అనే సింగరేణి ఉద్యోగి బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఇంట్లో నుంచి పని ఉందని మంగళవారం బయటకు వెళ్లిన సాగర్ బుధవారం తెల్లవారుజామున 3గంటలకు గోదావరిఖని బస్టాండ్ ఎదురుగా ఉన్న రోడ్డుపై కిందపడి ఉన్నాడు. స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా డాక్టర్లు చికిత్స అందిస్తుండగా మరణించినట్లు పోలీసులు తెలిపారు. అయితే సాగర్ ఒంటిపై గాయం, చెవి నుండి రక్త ఉండడం వల్ల అతని మృతిపై అనుమానం ఉందని సాగర్ తండ్రి గాదం రాయమల్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అరుణాచలానికి ఆర్టీసీబస్సు సౌకర్యం

మంథని, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11న జరిగే పౌర్ణమిని పురస్కరించుకొని అరుణాచలంలోని గిరి ప్రదక్షిణ కోసం మంథని, గోదావరిఖని ప్రాంతాల్లోని భక్తుల సౌకర్యం కోసం గోదావరిఖని నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం సంస్థ కల్పించినట్లు మంథని డీఎం శ్రావణ్ కుమార్ బుధవారం తెలిపారు. గోదావరిఖని బస్టాండ్ నుంచి ఈనెల 9వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు అరుణాచలంకు బయలుదేరి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా 10వ తేదీ రాత్రి 10 గంటలకు అరుణాచలంకు చేరుకుంటుంది. 11న పౌర్ణమి రోజు అరుణాచలం గిరి ప్రదక్షిణ అనంతరం సాయంత్రం అక్కడి నుంచి బస్సు తిరిగి బయలు దేరి జోగుళాంబ టెంపుల్ మీదుగా గోదావరిఖనికి చేరుకుంటుందన్నారు. 4 రోజుల ప్రయాణం కోసం గోదావరిఖని నుంచి పెద్దలకు రూ. 4,800, పిల్లలకు రూ. 4,100లు టిక్కెట్ ధర ఉంటుందన్నారు. వివరాల కోసం సెల్ నెం. 9959225923, 7382847269లను సంప్రదించాలన్నారు.